అభినవసరస్వతి

సంపుటము ౩౨	విక్రమ నామసంవత్సరము మార్గశిర పుష్యమాసములు	సంచికలు ౯,౧౦

నిజాము రాష్ట్ర బాల్యవివాహనిషేధశాసనము నిర్జీవత

సనాతనధర్మమునకు జే !

సంస్కర్తలమని బయలువెడలి సమభ్యస్తాంగ్లేయభాషులగు జనులు కొందఱు సర్వము జగన్నాథము సల్పుచుఁ జండాలదేవాలయప్రవేశాది శాసనములకై శక్తిని ధారవోయుచుండుట జగద్విదితము. ఆబుద్ధిమంతు లాంగ్లేయపాల్యమా నాస్మద్దేశమం దట్టి శాసనము లాచరింపించుటయే కాక స్వదేశసంస్థానములఁగూడ సల్పింపఁజూచుచున్నారు. వానిలోనిదే యీ నిజామురాష్ట్రపు బాల్యవివాహనిషేధశాసనము. తొల్లి బ్రిటిషురాజ్యమున శాసింపించిన శారదాశాసనమునకే తురుష్కులసమ్మతి దెల్పియుండ స్వరాష్ట్రమున సర్వథా సాగనీయరని పావ మాబిల్లు ప్రవేశపెట్టిన పతితపావనంమన్యుఁడు భారతీయులకుమాత్రమే ప్రతిపాదించెను. భరతఖండమే ప్రకృతనివాసముగాఁ గలిగి భారతీయులే యనఁదగియున్న యారాష్ట్రపు రాజు నవ్వయుజూలయిన యవనవీరుల యలజడికి నిలువఁజాలమని తెలిసికొనియెను. అయినను నారాజ్యమే యావాసమగుటఁగాఁబోలు భారతీయులే బాల్యవివాహనిషేధశాసనపుబిల్లును బాగుగాఁ బ్రతిఘటించిరి. అస్మద్రాజ్యమందాశాసన మమలులోఁ బెట్టఁబోవునపుడును నంతకంటె నధికప్రయత్నమే యాచరితము. అఖిలభారతవర్షీయ బ్రాహ్మణమహాసమ్మేళనమే యారబ్ధము. స్వరాజ్యవర్ణాశ్రమధర్మసభయే స్థాపితము. కాంగ్రెసువలె నాసభయుఁ గార్యము సాగించుచున్నది. సంవత్సరమునకొకసారి సంఖ్యకు మించిన సంఖ్యావంతుల సమావేశపఱచుచున్నది. కాని శాస్త్రనాథులకే సమ్మతముకాదు. అందువలననే యభిమతసిద్ధి యింకను నగుటలేదు. ప్రభుత్వసభ్యులే యానాఁడు పరిపంథిసభ్యులలోఁ బ్రవేశింపకున్న బాల్యవివాహనిషేధపు బిల్లు పటాపంచలయ్యెడిది. కాని యాయదృష్ట మస్మద్దేశమున కింకను నేర్పడదు. అదియట్లుంతము. నిజామురాష్ట్రపు బాల్యవివాహనిషేధపు బిల్లును నెగ్గకుండఁజేయుటకుఁ బట్టుఁబట్టినవారిలోఁ బ్రముఖుఁడు వణిజవంశజుఁడగు వంగపల్లి నీలకంఠముగారు ఈయన సికింద్రాబాదుపురవాసి. శ్రీమచ్ఛ్రేష్ఠుఁడా ? కాదు. సామాన్యుఁడు. వినవేమి ? ప్రాచీనాచార పరిరక్షణమున బద్ధకంకణుఁడు. అట్లయి యధికైశ్వర్యవంతులగు నత్రత్యాఖిలవైశ్యులకు నావేశ మెక్కించెను. సనాతనధర్మ సంరక్షణమునకు సన్నద్ధుల సలుపఁగలిగెను. సభలు స్థాపించెను. ఉపన్యాసముల నొనరింపించెను. ఉపన్యాసకేసరియగు సుమామహేశ్వరపండితుల సమావేశపఱచుకొనియెను. స్నేహితుఁడైన చివుకుల అప్పయ్యశాస్త్రిగారిని జేర్చుకొనియెను. ఆయన వారపత్రికయగు దివ్యవాణి ద్వారమున దేశదేశపు ధీమంతులకును బాల్యవివాహనిషేధపు బిల్లును బ్రతిఘటించుటకుఁ బ్రబోధించెను.

పైనఁ బ్రచారకులఁ బంపించెను. ప్రతిపట్టణముఁ బ్రతిగ్రామము ద్రిప్పించెను. అసంఖ్యాకుల యాశాసనవిషయమైన యసమ్మతుల నార్జించెను. కోట్లకొలఁదిఁ గూర్చెను. అప్పయ్యశాస్త్రియుమామహేశ్వరపండితులే కాక జగద్గురు పుష్పగిరి పీఠాధిపతులు గూడ పణిజవీరుఁడైన పంగపల్లి నీలకంఠముగారికి పలసినంత సాహాయ్యము సలుపఁగలిగిరి. స్వాములవారి సంస్థానపండితులు నిజామ్రాష్ట్రపుఁ బ్రజాసముదయమునకు బాల్యవివాహమే పరమధర్మమని ప్రబోధించుటయుఁ జాలమంది సమ్మతులిచ్చిరి. ఎట్లయిననేమి ? శ్రీ పుష్పగిరిపీఠస్వాములవారియొక్కయు నుమామహేశ్వరపండితులయొక్కయు నప్పయ్యశాస్త్రిగారియొక్కయుఁ దోడ్పాటుతో నిజామ్రాష్ట్ర సనాతనధర్మసభాకార్యదర్శియగు నీలకంఠముగారి పట్టుదల హెచ్చఁగలిగెను. ప్రతిపక్షుల వోట్లకన్నను సనాతన ధర్మిష్ఠుల వోట్లు చాల నధికమగుటయు శాసనసభవారు నిజామురాష్ట్ర బాల్యవివాహ నిషేధపు బిల్లును నిర్జీవము గావించిరి. తత్సభ్యులు బ్రిటిషుప్రభుత్వసభ్యులవలెఁ బ్రతిపక్షసభ్యులలోఁ జేరక పరమాస్తికు లయ్యును భారతీయధర్మమునే పరిపాలించిరి. గోలకొండ కూనరాగములు దీనినట్లు సనాతనధర్మిష్ఠులు గాక శాసనసభనుండి ప్రతిపక్షులే పెటట్లు దులుపుకొనుచు బహిర్గతులైరి. బిల్లు ప్రిదిలిపోయిన పిదప నిఖిలసనాతన ధర్ములను నీలకంఠముగారి నాలింగనము చేసికొనిరని గోలకొండ హేళనముగా నన్నను సనాతనుల శాపముతే మద్రాసురాష్ట్ర ప్రధానామాత్యపదవికి మున్మున్ దొలఁగించెనన్న రాజగోపాలాచారిగారి మాటవలె సాజమే యైయున్నది. శ్లో. ధర్మ ఏవ హతో హంతి, ధర్మో రక్షతి రక్షితః. ఈ నుడియే మా నీలకంఠముగారి మనోరథసిద్ధికైన ఘన కారణము. ఉమామహేశ్వరపండితుల యుపవాసవ్రతమున కుచితమైన ఫలము. అప్పయ్యశాస్త్రిగారి యావేశమున కర్హప్రతీకారము పుష్పగిరిస్వాములవారి పూనికకు భూషణము.

శ్లో. జయతు సనాతనధర్మః । జయతుచ జగద్గురుపీఠసముదాయః
జయతు సచ నీలకంఠః । జయతు సదాచారరతజన స్సర్వః.

—• శ్రీగద్వాలమహారాజ్ఞీదత్తస్వీకరణ మహోత్సవము – యౌవరాజ్యపట్టాభిషేకము •—

(శతావధాని, గాడేపల్లి వీరరాఘవశాస్త్రిగారు, గద్వాలాస్థానకవి.)

శ్రీమదఖండలక్ష్మీవిరాజమాన దక్షిణహిందూస్థాన మాననీయనిజాంపరిపాలనాన్విత మండలాంతర్గత శ్రీగద్వాలమహారాజసంస్థానావతంసము సుజనవిదితము. కృష్ణాతుంగాపావనోదకపరివేష్టిత పుణ్యమండలమై పాకనాటిరెడ్డిక్షత్రియనిష్కళంకప్రేమాభిరామంబై శ్రీసోమనాద్రిప్రముఖ రెడ్డికులదీపభూపబాహాబలోపార్జిత వీరవిజయలక్ష్మీక్రీడామందిరంబై లక్ష్మీసరస్వతీసమాన సౌభాగ్యవిభవాశ్రయంబై త్యాగభోగములకు నునికిపట్టయి ప్రభుభక్తిప్రజారంజనకళల కైకమత్యమేర్పఱచి శ్రీవిద్వద్గద్వాలధర్మసంస్థానాభిఖ్యతో భారతీయప్రాచీనపరిపాలనాధర్మప్రాయముగ నున్న దీనిని ముష్టిపల్లివయః పారావారరాకాసుధాకరులు విద్వద్రాజులై రాజులై కులదైవమైన శ్రీలక్ష్మీచన్న

కేశవసంతోత్సవప్రతివత్సర సత్సపర్యాసత్కార చమత్కారములతో ననంతకీర్తి యుతులై పరిపాలించుచున్నారు. వీరిలో మహారాజశ్రీ సీతారామభూపాల్ బహద్దరు గారి యర్ధాంగలక్ష్మి యైనశ్రీమదాదిలక్ష్మీమహారాజ్ఞిగా రిప్పుడుగూడఁ దద్ధర్మసంస్థాన పరిపాలనకార్యక్రమములోఁ బూర్వరీతుల కన్నివిధముల నన్నియును గల్పించి కుల దైవత కేశవానుగ్రహమున రాజ్యాంగ విద్యాంగముల నుచితజ్ఞత నిర్వహించుచున్నారు. ఔరససంతానభాగ్య మెన్నితరములయేలుఁబడిలోనో కడిగిగాలించి చూచిన నగపడక మాలఁబడినయీమహారాజవంశమున నిరువురు కన్యకామణుల శ్రీభూదేవులవలెనో లక్ష్మి సరస్వతులవలెనో పతిశుశ్రూషాఫలముగఁ బ్రజాసంతతి యదృష్టమో యన్నటులు భగవ దనుగ్రహమునఁ గాంచి వరలక్ష్మి శ్రీలక్ష్మి నామములతోఁ బ్రేమలత లల్లువెట్టుచున్న దీమహారాజ్ఞి యనుటలో నీతల్లియందలిపరమోత్కృష్టధర్మము వేఱుగఁ బ్రశంసింప నక్కఱలేదు. శ్రీసంతానమాత్రవరలాభ మంది పదునెనిమిదిసంవత్సరములక్రిందటనే యర్ధాంగలక్ష్మికి సింహాసనాధికారము ప్రసాదించి స్వర్గసందర్శనకుతూహలియై భౌతిక శరీరమునువిడిచి జ్ఞానదృగ్గోచరుండై చేదోడువాఁదోడుగ నంతర్వహించుట సుస్పష్టము. కులస్థానపౌరుషములలోను నసాధారణసంస్థానధర్మపరిపాలనలోను విద్వత్కవిగాయ కానల్పకల్పనావివిధకళాకౌశలత్యాగభోగములలోను వినుతికెక్కినశ్రీరాజా దోమ కొండరాజేశ్వరరావు బహదరుగారి కగ్రపుత్రుఁడై నవనాగరకరాజవిద్యాపారంగ తుఁడై రూపజితనవమన్మథుఁడైన శ్రీరాజా సోమేశ్వరభూపాల్ బహదరుగారికి శ్రీమంతు గద్వాలమహారాజ్ఞిగారు నిజాగ్రపుత్రీమణి యైనశ్రీవరలక్ష్మీదేవమ్మగారి నిచ్చి శ్రీచెన్నకేశవప్రీతిగ సాలంకృతకన్యాదానమహోత్సవము జరిగించిరి. వారిదాం పత్యాన్యోన్యానురాగఫలితముగఁ బండితకవిబుధాశీర్వాదదైవానుకూలముగఁ ద్రిమూ ర్తులవలె సుతత్రయ ముదయించి పాకనాటివంశాభరణములై విరాజిల్లి శ్రీకృష్ణరామ సీతారామభరతరామనామములఁ వర్ధిల్లిరి. శ్రీవరలక్ష్మీదేవియు నిజజనని శ్రీసంతాన సౌభాగ్యమందినఁ దాను వీరమాతయై రాజరత్నముల మువ్వుర నుభయకులవర్ధనుల నను గ్రహించి యీమహోత్సవము స్వర్గమందున్న నిజజనకుని కెఱిఁగింప నన్నట్లిరువది యాఱవయేటనే యీప్రజానిర్వహణభారమును శ్రీరాణిగారి కర్పించి భౌతికశరీరమును విడిచి తండ్రియంకపీఠి నాశ్రయించె. ఘనతగాంచిననిజాం శ్రీఉస్మానలీపాదుషాసార్వ భౌములధర్మపరిపాలనానుగుణ మైనదత్తస్వీకరణాధికారమును బొంది యీవిక్రమనామ సంవత్సరకార్తిక బ॥ ౨ పగలు 8 గం 15 నిమిషములకు నాఁడె 9 గం॥ 22 నిమిషముల కును దనప్రథమదౌహిత్రమణియు శ్రీరాజా దోమకొండ సోమేశ్వరరావు బహదరుగారి ప్రథమపుత్రరత్నమునగు చి॥రాజా కృష్ణరామభూపాల్ బహదరు కులశేఖరుని సశాస్త్రీ యముగ ననంతవైభవములతో వేదవేదాంగపారంగతాశీర్వాద నినాదములతో నశ్వ గజ రథాయుధదాసదాసీపురోహితవిద్వత్కవిగాయక వందిమాగధ ప్రోన్నతోద్యోగవా రాంగనాకదంబంబులతో దత్తస్వీకరణపట్టాభిషేకమహోత్సవములు జరిగించిరి. శ్రీ కేశవ సన్నిధానమునఁ బ్రతివత్సరకార్తికపూర్ణిమ శ్రీబ్రహ్మోత్సవపరిషద్వర్షాశననిమిత్తాగత విద్వద్వైదికమహాజనాశీర్వాదలాభ మపేక్షించి కార్తికోత్సవసమయముననే ముహూర్త నిర్ణయించుటవలన నన్నదానములు వార్షికములు మామూలుగ భరించుచు నేతన్మహోత్స

వజ్రయుక్తమణికనకరాంకవవస్త్రగంధమాల్యాదుల ననంతవైభవముగ భరింపవలసివచ్చినను గార్యోత్సాహము నిర్వహణదీక్ష నద్వితీయముగ నెఱవేర్పఁబడినది. తొమ్మిదిసంస్థానములనుండి కొందఱధీశులుఁ గొందఱు ప్రతినిధులుఁ గొందఱాస్థానపండితులు సపరివారబాంధవముగఁ గానుకలతో విచ్చేయఁగల్గిరి. సప్తఋషులవలె నేడుమతములనుండి మతాచార్యప్రతినిధులుఁ బండితులు మంగళాశాసనములతోఁ బారితోషికములనుజపించి దీవించిరి. స్వగురువులైన శ్రీమదహోబిలస్వాములప్రతినిధులతో దక్షిణను తాచార్యపట్కా మంగళాశీస్సులతో నసంఖ్యాకపండితమండలముతో సభ క్రిక్కిఱిసియుండెను. భాగ్యనగరప్రముఖులలో రాజబహదూర్ వెంకటరామారెడ్డి (ఓ, బి, ఇ) గారు వారిప్రథమ పుత్రరత్నము శ్రీ రంగారెడ్డిగారు (ఎక్సైజుడిపార్టుమెంటు కమీషనర్) రెండవపుత్రరత్నము శ్రీలక్ష్మారెడ్డిగారు (హైకోర్టుజడ్జి) మాడపాటి హనుమంతరావుగారు (భాషాభిమానులు) ఏ వెందల సీతారామరావుగారు (ఉస్మానియావిశ్వవిద్యాలయము సైన్సు ప్రొఫెసరు) మొదలగువారనేకులు విచ్చేసిరి. కొందఱు సకుటుంబముగ దయచేసిరి. సకాలమునకు రాఁజాలని పండితప్రకాండులు కొందఱు తమయాశీర్వచన పద్యరత్నసువర్ణ పుష్పములను డపాద్వారమున సకాలమున కందించి సంస్థానాభిమానమును వెల్లడించి శ్రీమహారాజ్ఞిగారి యాదరణకుఁ బాత్రభూతులైరి వారిలో ముఖ్యులు (1. బ్ర॥ శ్రీ॥ కంకవీంద్రఘటాపంచాననాది బిరుదాంకిత శతావధాని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు (2) ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారు (ఉస్మానియా ఆంధ్ర ప్రొఫెసరు) (3) వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు (భాషోద్ధారక) (4)చతుర్వేది అమరేశ్వరశాస్త్రిగారు, గుంటూరు (5) ఆంధ్రమహిళాసంఘము, హైదరాబాదు (6) భుజంగరాట్కవి మొదలగువారు తమ మంగళాశీర్వాదకృతిరత్నములను పట్టాభిషేకార్హోపాయనమాలికఁ గానుక లంపించి ధన్యతం జెందిరి.

గంగా గౌతమీకావేరీప్రముఖ పుణ్యనదీతీర్థంబులును,మహాసముద్రోదకంబులును దిరుపతి భద్రగిరి ప్రయాగ రామేశ్వర హరిద్వార కేదార బదరీనాథాది నానాముక్తిస్థాన తైర్థిక తీర్థదైవతప్రసాదసంగ్రహకార్యక్రమము యథావిధిగ సమకూరెను. వేదనాదములతో జయజయమంగళనినాదములతో ధ్రువమంత్రపఠన మొనరించు సిద్ధపురుషుల పరావాదములతో త్రిదశపీఠమున దేవతలు మహేంద్రు నభిషేకించి చతుర్దశ భువనాధిపత్య మిచ్చినట్లు గ్రహమండలంబున ఛాయానాథుని గిర్వాగార్గ్యకశ్యపవసిష్ఠాదులు జ్యోతిర్మండలాధిపత్య మభిషేకించునట్లు సాకేతంబున నెల్లరాజులు శ్రీసీతారాముల నుంచి పట్టాభిషేక మొనరించినట్లు శ్రీగద్వాలరాజ్ఞీప్రయుక్త ఋత్విగ్గణంబులు, సాను తపశ్చర్యానవద్యులగు శ్రీ మేడవరము సుబ్రహ్మణ్యశాస్త్రులు గారు పరిసర సంస్థానపాలక మతాధిపసమక్షంబున నానా తైర్థిక బ్రహ్మమండల, ప్రోన్నతోద్యోగ రాజబంధుసమాజము క్రిక్కిఱిసినమహాసభలో ననర్ఘమణికనకసింహాసనాసీనుండై బాలభానునివలె విరాజిల్లి శుక్లపక్ష క్షపానాధునివలె నాహ్లాద మొసఁగుచున్న చిరంజీవి రాజా కృష్ణరామభూపాల్ బహదరుగారిని గనకకలశధారోదక పావనతీర్థములతోఁ గనకాభిషేక సువర్ణపుష్ప పూజల నాగమవిధిచోదిత మంత్రములతో నభిషేకించిరి. పూజ్యు లెల్లరు మూర్ధాభిషేక కార్యకాంతులలోఁ బాల్గొని 'చిరాయుష్మాన్ భవ' 'శతాయుర్భవ' ఇత్యాదిపూజ్యా

శీర్వచనముల నలంకరించిరి. శ్రీ కేశవసందర్శనము, అర్ఘ్యగణపూజలుఁ బండితాశీర్వాదములుఁ గట్నములు చదివించుట ప్రతిసత్కారముఁ దదుపరి పండితబ్రాహ్మణసువాసినీపూజలు, ఫలకుసుమగంధదానసత్కారములుఁ బెద్దలకు నమస్కరింపఁ జేయుట జరిగెను. వస్త్రపాత్రరాంకవమణికనకాదులతో నెల్లర నపారముగ సత్కరించిరి. పౌరజానపదులకు విప్రజాతులకు నన్నదానము సంతృప్తికరముగ నొనరించిరి. మాఘపూర్ణిమ నాఁటందున విద్వత్కవిగాయకవారాంగనాది బృందములు వచ్చుటకుఁ దరువాయి యైనది. వారప్పుడు స్వభావసిద్ధముగ రానదను కాదు. ఆహ్వానింపఁదలఁచిన మూడుమాసములలోనే తిరిగి రావలసియున్నది గాన వృథాప్రయాసలగునని కాఁబోలు నుపేక్షించిరి. ఐనను శ్రీవిద్వద్గద్వాల నేఁటికి 'రాజన్వతి' యగుచున్న దను నిర్భరానందమునఁ గొందఱు మఠాధిపతులు వారిబుధులు శ్రీ సంస్థానసన్నిధి విద్వాంసులుఁ గవులు రాఁగలిగిన మఱికొందఱు పూజ్యులుఁ దరగతివారిగ నామహాసభలో శ్లోకపద్యపూర్వకమంగళాశీర్వచనములు పఠించిరి. పిదప రాజ్ఞిగారియనుమతితో నాశీర్వచనములు పంపిన పెద్దల పత్రికారత్నములను బఠింపఁగా వానినెల్ల గ్రంథరూపముగ ముద్రింపింప ననుజ్ఞ యిచ్చిరి. ప్రత్యక్షముగఁ జదివినవారిలో శ్రీమదహోబిలమఠ కార్యకర్తగారు, ఆస్థాన విద్వాన్ పుల్లగుమ్మి శ్రీనివాసాచార్యులవారు, ఆస్థానకవి గాడేపల్లి వీరరాఘవశాస్త్రి శతావధానిగారు విద్వాన్ తోపు వెంకటాచార్యులవారు, పండిత అనంతరాఘవాచార్యులవారు శ్రీబుక్కపట్టణము కవితార్కిక సింహాచార్యులవారు (ఆత్మకూరు) వైద్యము శ్రీనివాసశాస్త్రి (ఆస్థానవైద్య) మొదలగువారు చదివిరి. అప్పుడే టీచరు నూరిరెడ్డి గారు చిరంజీవులగు శ్రీకృష్ణరామభూపాల్ బహాదర్ గారిని గుఱించి వచనరచనతో నొక దీవనపత్రమును జదివి సమర్పించిరి. గొబ్బూరి సంజన్నగారు (భక్తులు) పూర్వ రాజపరిపాలనానుగుణ ధర్మ ప్రబోధముగ నొక యభిమాన ప్రకటనను శ్రీకుమారరాజా కృష్ణరామ భూపాలుగారికిఁ జదివి సమర్పించిరి. బ్రాహ్మణ్యులగు శ్రీకట్టా అగ్నిహోత్రిశాస్త్రిగారు చతుర్వింశతి గాయత్రీమంత్రప్రారంభవర్ణ సశ్లోకములతో గీర్వాణ భాషాశీర్వాద మతిమనోహరముగ నాశీర్వాద కాలమునఁ బఠించినందున వారి కానభలో నుండెడి శ్రీరాజ్ఞిగారు రు. 116—0—0 రూపికలు బహుమాన మిచ్చి యుదార ధర్మమును వెల్లడించిరి. ఆశీర్వాదపద్యములు రాఁగలపత్రికలలో వెల్లడికాఁగలవు. శ్రీ కేశవానుగ్రహము చి॥ రాజా కృష్ణరామభూపాల్ బహాదర్ గారిని శ్రీరాజ్ఞిగారిని వారి సామ్రాజ్యమును వారి కుటుంబములను నాచంద్రతారార్కము వర్ధిల్లఁజేయుఁ గాక! ప్రజలాధివ్యాధులు లేక క్షామబాధలు తొలఁగి సంపూర్ణప్రేమతో నెసంగుదురు గాక! శ్రీ రాణిగారు స్వాజ్ఞావశవర్తులై యెల్లకార్యక్రమంబులలో నప్రమత్తులై కన్నులు దెఱచి పనులు జరిగించి జయప్రదముగ నెఱవేర్చిన వారిసన్నిధిసేవకులసేవను చిత్తగించిరి. వారికిఁ జేఁదోడు వాఁదోడై ధాత్రీశ్వరి యనుగ్రహింపఁగాక! సకాలవర్షములతో దేవుఁడు సముచిత కృపాకటాక్షములతో నిజాంప్రభువు లీసామ్రాజ్యలక్ష్మిని బాలకులను దత్ప్రజలను నాశ్రితులను సదా రక్షించుచుందురుగాక! స్వస్తి సర్వేషాం సన్మంగళాని భవంతు! శ్రీ శ్రీ శ్రీ.

—♦ జాగుసేయకుఁడు. ♦—

(విద్వాన్ - అంబడిపూడి నరసింహశాస్త్రిగారు
పుష్పగిరిపీఠపండితుఁడు, ధర్మప్రచారకుఁడు.)

శా॥ రండో ధార్మికవీరులార! మన ధర్మంబెల్ల దుశ్శాసనా
ఖండోద్దండ కుఠార ధారలకు నగ్గంబయ్యె. హిందూ క్రియా
కాండంబెల్ల నశింపనయ్యె. హృదయాత్కంఠ్యంబుతో ధర్మ మీ
ఖండంబందు నఖండముగా సలుప దీక్షల్బూనరా రండహో॥

మ॥ మన తాతల్ మన తండ్రు లెల్లరును ధర్మ శ్రద్ధ చేఁబూని చే
సిన బాల్యోద్వహనంబు నేఁడు మనకుఁ జేయంగ రాదంట. ఏ
మనఁగానౌ. పయి శాసనంబునకుఁ బూర్వాంశంబె యేమేని మా
ర్పును గావింపఁగ వేళ. రండు మనబాల్యోద్వాహముల్ నిల్పఁగన్॥

శా॥ వేదంబుల్ ప్రబలప్రమాణములు. ఆ వెన్వెంట శాస్త్రంబు. లా
మీఁదన్ శిష్టచరిత్ర. మిద్దియె చూఁడీ మేధ్యార్యహిందూమత
ప్రాధాన్యప్రతిపాదకక్రమము. కూళ ల్కొంద ఱాత్మేచ్ఛచే
వేదం బొక్కటె మానమందు రిది యొప్పే? ధర్మముల్ నిల్చునే?

శా॥ బైబి ల్కాదనువాఁడు క్రైస్తవుఁడె? గర్వస్ఫూర్తిచేతన్ ఖురాన్
ప్రాబల్యంబున కొప్పకున్నను ముసల్మానౌనె; వేదస్మృతుల్
సాబాధంబు లటన్న హిందువుఁడె? ఈసంస్కర్త లెల్లన్ స్మృతి
ప్రాబల్యంబున నొప్ప. రిట్టిడుల దుర్వాదం బనర్థం. బహో!

సీ॥ తన పెంచి పెద్ద చేసిన పిల్లపెండిలి
నొనరుపం దండ్రి పెత్తనములేదు.
కుల వయ శ్శీలము ల్గలవరాన్వేషణం
బిఁకఁ దల్లి తండ్రి ఘటింపఁ జనదు.
మంచి సంబంధ మీమధ్య వచ్చినఁగూడ
పదియునాల్గేండ్ల కావలనె పెండ్లి.
వేదశాస్త్రంబుల బోధ లింతకెగాని
ఇటుపైని చేయఁబూనుటలు తప్పు

తే॥గీ॥ బాధలెన్నొ వివాహ నిషేధశాస
నంబునం గల్గు. ధర్మంబు నామ రూప
మేమియున్ లేక నశియించు ఇంత నిజము.
కనులు దెఱపుఁడు హైందవాగ్రణ్యులార !!!

— యాదగిరి విశేషములు —

ఇందలి శ్రీ లక్ష్మీనరసింహ దేవస్థానమున నీమార్గశిర శు॥ ఏకాదశిప్రభృతి పూర్ణిమాపర్యంతమును బండితసమావేశపరీక్షాదులును భగవదుత్సవసేవావైభవాదులును బ్రతివత్సరరీతినే బాగుగా జరిగినవి. అందు నిజామురాష్ట్ర బాల్యవివాహనిషేధశాసనము సనాతనధర్మవిరుద్ధమని వ్యాకరణశిరోమణులగు ఖండవల్లి నరసింహశాస్త్రిగారి యధ్యక్షతతో సభ జరిపిరి. అందు శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరిసంస్థానపండితులును నేతద్దేవస్థాన విద్వత్పరీక్షాధికారులును నగు మల్లాది దక్షిణామూర్తిశాస్త్రిగారు తర్కశాస్త్రపరీక్షాధికారులగు వంగల నరసింహాచార్యులుగారు కవితాసాహిత్య పరీక్షకులగు సహస్రావధాని జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు వ్యాకరణశిరోమణి గోవర్ధనము రామానుజాచార్యులుగారు గాయత్రీప్రచారక వంకమామిడి ఆదినారాయణశాస్త్రిగారు మొదలగు పలువురు విద్వాంసులు పాల్గొనిరి.

మఱియు వేదవేదాంగవిదులును బ్రతిభాశాలురు నగు బ్రాహ్మణులును ధార్మికులగు తదితరులును సుమారు 200 సమావిష్టులైరి. దక్షిణామూర్తిశాస్త్రిగారు సత్పురుషసమావేశముననే భగవదుత్సవాదులు ప్రవర్తింపఁబడిన ట్లుద్బోధించిరి. వ్యాకరణపరీక్షకులగు నధ్యక్షులు సనాతనధర్మమన నేమి యనువిషయమును సదాచారమువల్లఁగలుగు ఫలమును శాస్త్రానుభవములచే నిరూపించుచు రజోదర్శనానంతరవివాహితలగు దమయంతీప్రభృతుల జితేంద్రియతా పతిభక్తి శాపానుగ్రహసామర్థ్యాదు లీయుగమున నెవ్వరికి నలవడవు కావునఁ బ్రౌఢావివాహములు జరిగెడిచో బహువిధ దురాచరణములచేఁ బ్రజామండలి స్వేచ్ఛాచార వివాహవిచ్ఛేదాదులవల్లఁ బశుతుల్యత నొందునని నానావిధకష్టనష్టములఁ గనఁబఱచుచు నుపన్యసించిరి. నరసింహాచార్యులుగారు కన్యావివాహము కలికాలమున నార్షసమ్మత మగుటచే నాచరణయోగ్య మనియుఁ దలిదండ్రులే తగిన వరున కిచ్చి పరిణయ మొనర్పుట పరమధర్మ మనియుఁ గన్యలే స్వయముగాఁ గన్యావరయతే రూప మన్నట్లు రూపవంతుల వరించి వివాహమాడి భర్త్రధీనలు గాకయుండెడిచోఁ బలువిధములగు నధర్మకర్మలకుఁ బాల్పడుదురనియు నధర్మమువల్ల స్త్రీలు దుష్టలై వర్ణసంకరకారక లగుదురనియు నందుచే బాల్యవివాహములు శాస్త్రానుభవములచేఁ బ్రశస్తములనియు నుపన్యసించిరి. తదుపరి గోవర్ధనము రామానుజాచార్యులుగారు బాల్యవివాహములచే వైధవ్యము కలుగునన్నమాట ప్రౌఢావివాహములకును వర్తింపదాయని యుపన్యసించిరి. అనంతర మాదినారాయణశాస్త్రిగారు బాల్యమునుండి యభ్యస్తములైన భర్తృప్రేమ పాతివ్రత్యములకుఁ జెట్టున కల్లుకొనెడి తీఁగలాగుగాఁ బరస్పరానుకూలభావము కల్గి యానందమునకు మూలకందమగును గాన నాయభిమతముకూడ బాల్యవివాహమే యని యుపన్యసించిరి. ప్రతికూలభావముగలయట్టి వారలకును నవకాశ మొసఁగఁబడినది. అటుపిమ్మట నధ్యక్షులును సభ్యులును నామోదించి కరతాళధ్వనులతో సభ ముగించి తంతిద్వారమునఁ బ్రభుత్వమువారికిఁ దెలియపఱచిరి.

శ్రీ పుష్పగిరిపీఠాధిపతుల పనుపున సనాతనధర్మప్రచారకులుగానుండిన మల్లాది దక్షిణామూర్తిశాస్త్రిగా రదే సందర్భమం దుత్సవమున కరుదెంచిన పండితమండలివలన

నిజామ్‌రాష్ట్ర సనాతనధర్మసభకుఁగాఁ గొన్ని చందాలు వేయించి తత్సభకుఁ జేర్చిరి. వీరు ధర్మపురిమున్నగు చోట్లఁగూడ గాఢప్రచారము గావించి ప్రజాబాహుళ్యమును బాల్యవివాహమునకే యభిముఖులఁ జేసి సంతకములు తీసికొనియుఁ జందాలు వసూలుచేసియు సభకు సమర్పించియున్నారు. యాదగిరి విద్వత్పరీక్షకులలోఁ బ్రధానులై విద్వద్బ్రాహ్మణులు చేయవలసిన విధులు వినిర్వర్తింపించుచు భగవత్సేవాబద్ధతం బ్రకటించుచుందురు. మార్గశిర శు ౧౧ నాఁటికే తాను వచ్చి తక్కువిద్వాంసు లట్లురాకుండుచో నొక్కి చెప్పుచుందురు.

—♦ శ్రీశ్రీ జగద్గురు విరూపాక్షపీఠ సంచారము ♦—

శ్రీమ చ్ఛంకరభగవత్పాదులయొక్కయు శ్రీ విద్యారణ్యులయొక్కయుఁ బరంపర విడకుండ వచ్చు ధర్మవ్యవస్థాపక గురుపీఠములలో నొకటియగు శ్రీవిరూపాక్షపీఠము ప్రకృతము నిజామురాష్ట్రమున సంచరించుచున్నది. నిజామాబాదుజిల్లా నిర్మలగ్రామమున నీవిక్రమ సం॥ వైశాఖ బ ౧౧ ప్రవేశించి కార్తిక శు ౬ పర్యంతము ౫ నెలల ౧౦ దినము లొక్కగ్రామమున నుండుటవలననే తద్గ్రామముయొక్కయుఁ దత్రత్యులయొక్కయు నౌత్కృష్ట్య మభివర్ణనీయమై యగపడియెడిని. నిర్మల నిజామాబాదుజిల్లాలోని యొక తాలూకాగ్రామమై హైస్కూలు మునసపుకోర్టు మొదలైనవానితో నలరారుచు ఖ్యాతమై యున్నయది. బహుసంఖ్యాకులగు భాగ్యవద్గృహస్థులచేఁ బరివేష్టితము. భాగ్యముతోపాటు బ్రాహ్మణులయందును నందును నాచార్యులయందును నత్యంతముగు భక్తి యత్రత్యుల కలరుచున్నది. అందువలననే గురుపీఠము నింతకాలము కొసరికొసరి నిల్పుకొని యనుదినభిక్షాపాదపూజాదు లాచరించుటయే కాక చాతుర్మాస్యదీక్ష చక్కగా జరిపించిరి. ఈ చాతుర్మాస్య దీక్షామధ్యముననే ప్రకృతపీఠాధ్యక్షులైన సచ్చిదానందాభినవశంకరభారతీస్వాములవారి సాక్షాద్గురువులగు శ్రీ విద్యారణ్యభారతీస్వాముల నిర్వాణదిన మరుదెంచుటయుఁ దదారాధన మత్యంతవైభవముతో నహస్త్రయ మాచరితము. 3 దినములు ముప్పదేసి బ్రాహ్మణుల గురుస్థానమునఁ గూర్చుండఁబెట్టి యైదేసిరూపాయల విలువగల యంశుకములచే నలంకరించి యైదేసిరూపాయల దక్షిణలర్పించిరి. ఈ విషయమునఁ గనఁబడుచెడి సంస్థానామాత్యులగు రాచూరు సుబ్బయ్యశాస్త్రిగారి యౌదార్య మభివర్ణనీయము. కేవల వస్త్రములే కాక యప్పుడప్పు డీయారాధనమున శాలువులే సమర్పించుచుందురు. ఈ సం॥ సమయమునకు సంసిద్ధము కాలేదుకాని వెండిగ్లాసులే విప్రుల కొసంగుటకు సుబ్బయ్యశాస్త్రిగారు ప్రయత్నించిరి. భాద్రపద శు ౧౫ విశ్వరూపయాత్ర నిర్వర్తిత మగుటయు దేవీనవరాత్రోత్సవముగూడ నిచ్చటనే జరుగవలెనని ప్రజలు ప్రార్థించిరి. ఐదాఱువేలరూపాయల వ్యయముతో నయ్యుత్సవ మాచరింపించిరి.

యథాశక్తిపూజాదికము నాచరించుటయే కాక యానవరాత్రోత్సవమున సహస్రసంఖ్యాకుల సంధృతనూతనవసనులం గావించుట సంస్తవనీయము. అంతటివ్యయమునకత్రత్య బ్రాహ్మణవైశ్యాదుల భక్త్యుద్రేకపురస్సర బహుధనప్రదానమే ప్రధానకారణము. అచ్చటి శిష్యు లనేకులు శక్తినిమించిన త్యాగమును సల్పిరనుట స్వభావోక్తి. ౫ నెలల

పదిదినములు నప్పుర మలంకరించి యాచార్యు లన్యగ్రామమున కరుగునాఁ డశ్రుల వెంబడి నంబువులు గార్చుచు నర్ధయోజనపర్యంతము ననుగమించిరని యాకర్ణించినవారి కవ్వారి గురుభక్తి యపారమని తోఁపకపోదు. ఇంతభక్తి యివ్వారికిఁ గలుగుటకుఁ బీఠమహిమయే కాక పీఠాధిపతుల ప్రబోధముగూడఁ గారణమయియున్నది. శిష్యులకుఁ జేయవలసిన బోధ స్వాములవారు చక్కఁగా నెఱవేర్చిరి. ఆస్థానపండితుల ముఖమున నవ్వాహముఁ బురాణప్రవచనమే కాక సదుపన్యాసములుకూడ సాఁగించిరి. పమిడిముక్కల చంద్రశేఖరశాస్త్రి ప్రభృతులు ప్రస్తుతాస్థానపండితులు. చంద్రశేఖరశాస్త్రిగారు సాహిత్యవస్మాత్రులే కాక తర్కవ్యాకరణవేదాంతశాస్త్రజ్ఞులు. సజ్జనులు. శాంతులు. అవ్వారి పురాణముగాని యుపన్యాసముగాని తుదకు సామాన్యసంభాషణమే కాని పండితపామరభేదము లేకుండ సర్వసులభమై చక్కఁగా విదితమయ్యెడిది. అమృతము గురియుచు నాచార్యవ్యవహారముల నన్యమార్గమున నరుగనీయక ధర్మమందును దైవమందును దత్పరతఁ గూర్చెడిది. వారి ప్రబోధమునకుఁ దోడు వకీళ్ళు మువ్వురవ్వీట వర్తించుచుఁ బ్రజల ఋజుమార్గమునకు లాగి విరూపాక్షపీఠమునకు వివిధోపచారములఁ జేయించి నిర్మలగ్రామాహ్వయమును సార్థక పఱచిరి. ప్రకృత మాపీఠసంచారము నిర్మలప్రాంతగ్రామములలో నెఱపఁబడుచు యత్కించి న్న్యూనాధికముగా నాగ్రామసంచారమునే యనుకరించుచున్నది. ఆయావిశేషములు చాలవఱకుఁ జంద్రశేఖరశాస్త్రిగారి క్రింది శ్లోకములే చెప్పుచున్నవి. పై వకీళ్ళు మువ్వురును 1 సుదర్శనరావుగారు. 2 వెంకటరావుగారు. 3 శ్రీనివాసరావుగారు.

శ్లో. శ్రీసచ్చిదానంద నవీనపూర్వః శ్రీశంకరాఖ్యో యతిసార్వభౌమః
నిరంతరానందవిలీనచేతా దయార్ద్రదృష్ట్యావతు భక్తబృందం. ౧

మోహాంబుధిం కిల మనోమయమందరేణ
నిర్మథ్య బుద్ధిగుణవాసుకిసంయుతేన
యే ప్రాపు రప్రతిహతం యతిరాజలక్ష్మీం
తాన్ శంకరార్యచరణాన్ సతతం నమామి. ౨

శ్రీనిర్మలాహ్వయపురే సకలాశ్చ విప్రాః
స్వీయాంచ కార్యవితతిం పరిముచ్య ధీరాః
శ్రీమజ్జగద్గురుపదాంబుజపీఠదేశే
కాలం నయంతి సతతం ముద మాప్నువంతః. 3

త్యక్త్వాన్యాన్ విషయాన్ సుదర్శనసమాఖ్యశ్చాత్ర శిష్యాగ్రణీః
శ్రీమచ్ఛంకరసద్గురూత్తమపదే భక్త్యా మహత్యా యుతః
చాతుర్మాస్యక మారచయ్య హృదయేఽసంతుష్య తన్మాత్రతః
దేవీపూజనమ ప్యచాలయ దహో పుణ్యం హి సౌదర్శనం. ౪

సుదర్శన! త్వం కరగో జగద్గురో వ్యాఖ్యాత్వాఖిలాన్ ధర్మపథే యునక్షి
అధర్మమార్గా ద్వియునక్షి యచ్చ సుదర్శనత్వం ప్రతిపద్యసే తతః. ౫
శ్రీమద్వేంకటరాయసద్గురువర స్యైతస్య పూర్ణోత్సవం
చాతుర్మాస్యపదాభిధేయ మమలం నిర్వాహ్య తస్మాత్రితః
నాతీరప్రమదంగతః. పునరపి ప్రాచాలయోంబార్చనం.
కింవర్ణ్యే భవదీయసద్గుణగణం? చౌదార్యభక్త్యాదికం? ౬
యద్విద్యాతిజ్ఞానభక్త్యోస్సహాయం వైరాగ్యంచానంతముక్తిప్రసిద్ధ్యై
తద్విద్యాత్రిశ్రీగురోః కార్యసిద్ధ్యై సాహ్యంశిష్యశ్శ్రీనివాసాభిధానః
మూర్తిత్రయం భిన్నరూపం గుణతః కార్యతః పురా
ఇదం మూర్తిత్రియ మభూ ద్గురుకార్యైకతత్పరం. ౮
శ్రీనిర్మలాహ్వయపురే గురుభక్తియుక్తాః
సర్వేపి చోరుజశిఖామణయ స్సమేత్య
హంపీజగద్గురు శరన్నవరాత్రహూప
పూర్ణోత్సవం నిరవహన్. కిము భాగ్య మేషాం! ౯
పూజాన్నదానేనవినా నభాతి త్యేత త్సమాలోచ్య సమస్త వైశ్యాః
శ్రీనిర్మలాఖ్యే నగరే దినేషు నవ స్వకార్షుః ప్రథితాన్నదానం. ౧౦

నిర్మలతాలూకాలోఁ జేరిన జెవిల గ్రామమునకు సమీపములో నుండు పొన్నకూరు గ్రామమునందుఁ బటేలు ముత్యపురెడ్డిగారి ప్రార్థనచేత శ్రీస్వాములవారు విజయముచేసి దత్తజయంతి మూడురోజులు జరిపిరి. ప్రతిదినముఁ బురాణము నభిషేకము దత్తకల్ప పారాయణ మొదలగునవి జరిగినవి.

——♦ శివకోటి మహోత్సవము ♦——

ఇయ్యది కార్తిక బ ౧౩ మొదలు మార్గశిర శు ౬ పర్యంతము నవరాత్రిలు నిజాము రాష్ట్రమునకుఁ జేరిన మెదకుజిల్లా సిద్దిపేటలో జరిగియున్నది. కర్త కానాథి భట్ల వెంకటరామసిద్ధాంతిగారు. వీరి నివాసము పల్నాడుతాలూకాలోనిదేయగు మల్లవోలు. ఈయన యిప్పటి కిరువది సం॥ల నుండి పంచాంగములను బ్రకటించుచుఁ బ్రఖ్యాతి పడయుచున్నవాఁడు. ఆ పంచాంగమునకు నిజామ్‌రాష్ట్రమున నితరాంప్రచారము గలిగి యున్నది. ఆ దేశమం దాయనవద్ద సిద్ధాంతభాగమును జదువుకొని శిష్యులైన క్షితిసురులు కూడఁ గొందఱు కలరు. అట్టిచో నాసిద్ధాంతిగారు శివభక్తులై తనకుఁ బరిచితిగల ప్రదేశములఁ బలువురకును భక్తి గలిగించిరి. తాము వ్రాయుటయే కాక తత్రత్యానేకులచేత శివనామమును వ్రాయఁ బ్రబోధించిరి. ఇట్లు ప్రబోధించి కోటినామములను వ్రాయించిరి. అదియే శివకోటి. అందుఁ జతుర్థాంశము (౨౫ లక్షల నామము)తోఁ దర్పణమును దచ్చ

తుర్థాంశము (౬ లక్షల ౨౫ వేల) తో హోమమును గావించిరి కాఁబోలు. అందుఁ జతుర్థాంశ మన్నదాన మాచరింపవలెను. అప్పుడు లక్ష ౫౬ వేల ౨౫౦ యగును. అంత మంది కన్నదాన మశక్యము. కాని సకలవర్ణములకును జరుపుచోఁ జాలవఱకు సాఁగ వచ్చును. ప్రత్యహమును బగలును రాత్రియు బ్రాహ్మణులు పదిపండ్రెండువందలు భక్షిం చుచువచ్చిరఁట. అంతమందియో యత్కించిన్న్యూనాధికులో వైశ్యులును వచ్చి భుజించి యుండనోపు. వైశ్యులాసిద్దిపేటలో సుమారు సహస్రసంఖ్యాకు లుండవచ్చును. అనేకు లైశ్వర్యవంతులు శివభక్తులు. ఆ వైశ్యుల తోడ్పాటుతోడనే సిద్ధాంతిగారు శివకోటి మహోత్సవమును జేయఁగలిగిరి. అందఱిలోను మొట్టమొదటివాఁడు మొలుగు కృష్ణయ్య గారు. దేవబ్రాహ్మణులయందు వీరికి విశ్వాసము విశేషము. ఇట్టిరు పదుగు రేకమై యీ శివకోటిమహోత్సవమును జేయించిరి. బ్రాహ్మణ వైశ్యులకే కాక పలువురు పరమదరిద్రు లకుఁ బ్రసాదమును బంచిపెట్టిరి. శివకోటివ్రాయించుట మొదలైనవే కాక సిద్ధాంతిగారి యీ కార్యములో నవరాత్రులును జరిగిన శివనామకీర్తనముతో జనులచెవుల తృప్తిపడలె నని నుడువవచ్చును.

కాంగ్రెసువాలంటరులవలెఁ గజ్జలుఁగట్టుకొని వణిగ్వ్యాపకులు శివనామసంకీర్తనము చేయుచుం జరించుట చూచి సంతోషింపని జన ముండదు. ఇట్టి జపతర్పణహోమాదిక ముతో సవనమువలె జరిగిన సిద్ధాంతిగారి శివకోటియుత్సవములో నర్త్విజు లఱువదు గురు. అందఱు పౌండరీకము శ్రౌతముఁజదివినవారు చాల. తక్కుంగలవారు స్వాధ్యాయ పరులు శాస్త్రజ్ఞులు సాహిత్యవంతులు. ఆఋత్విజు లందఱును సాక్షియకార్యము యథా తథముగా నాచరించుటయు నంతమం దర్ఘ్యపూజనము సిద్ధాంతిగారు చేసి శదాశీరక్షఁ లం దలఁదాల్చిరి. వీరుగాక యుపన్యాసకులు హరికథకులు భజనపరులు పలువురు పఱతెంచి స్వస్వవిద్యాప్రదర్శనపురస్సరముగా శివుని సేవించి సిద్ధాంతిగారి సత్కృతిని స్వీకరించిరి. అప్రతిగ్రహీతలయ్యుఁ బల్నాడు సత్తెనపల్లితాలూకాల బ్రాహ్మణగురుకులాశ్రమస్థాపకులును దర్కాలంకారవేదాంతశాస్త్రాభిజ్ఞులును నగు ముదిగొండ వెంకటరామశాస్త్రిగారుకూడ నియ్యుత్సవమున కేతెంచి స్వోపన్యాసముచేత నాప్రాంతజనుల నందఱ నానందపఱచిరి. గజవల్లి చంద్రమౌళిశాస్త్రిగారు మరుకూకు నారాయణశాస్త్రిగారు మున్నగు మహాసీయులు బహుసంఖ్యాకులు పఱతెంచి యక్కార్యమున కలంకారభూతులైరి. చంద్రమౌళిశాస్త్రి గారు సత్తెనపల్లి పల్నాడుతాలూకాల గురుకులాశ్రమమునకుఁ జందా వేయించి ౧౧౬ రూపాయలు వసూలుచేసి ముదిగొండ వెంకటరామశాస్త్రిగారి ద్వారమునఁ బదాశ్రమము నకు బంపించిరి.

—♦ గద్వాలకబురులు ♦—

గద్వాల శ్రీ సీతారామభూపాలుఁడు కాలధర్మము నొందినతరువాత ధవరా హిత్యాది లోపములు తమకుఁ గలిగియున్నను దద్ద్వారమునసైన తలపోత లోకవంకఁ దలయెత్తుచున్నను శ్రీమంతు,రాణి, ఆదిలక్ష్మీదేవమ్మ బహదరుగారు ప్రజాపరిపాలనమునను బండితబహూకరణమునను నెట్టిలోపము లేకుండ వ్యవహరించుచుండుట యభిజ్ఞుల

కెల్లరకు నవగతమే. అవ్వారి దౌహిత్రుఁడైన శ్రీకృష్ణరామభూపతియే యారాజ్యమును బాలింపవలసినవారై యుండుటయు శ్రీ రాణిగారీసం॥ కార్తిక బ ౧౧ దత్తస్వీకార పట్టాభిషేకమహోత్సవములు తాము నిర్వర్తించిరి.

శ్లో. శ్రీమత్కేశవదేవ శ్రితజనచింతామణి స్స సద్భాపః
 కామితఫలదో భూయా ద్గద్వాల్ సంస్థాన భూభుజా మేషాం.

సీ. వీరి దైవతభక్తి కారసి యేటేట
 సలిపెడి కేశవోత్సవమె సాక్షి.
 బ్రాహ్మణ్యమునఁగల పరమాదరమునకు
 పోష్యమాణ ధరావిబుధులె సాక్షి
 అనుపమానైతదీయౌదార్యమున కల
 విద్వద్బహూకారవిధులె సాక్షి.
 కవితారసజ్ఞత కవితధైతత్పురీ
 వర్తులౌ సత్కవివరులె సాక్షి
 ఉన్న దెంతయొ సాక్ష్యం బహో తదీయ
 యోగ్యతం దెల్పఁగలయది యుర్వి నింక.
 వశమె గద్వాలభూపాలవంశభవుల
 పేర్మి యేతాదృశంబని పేరుకొనఁగ!

—♦ గృహప్రవేశ మహోత్సవము ♦—

అభినవసరస్వతి కోక పోషకులును నిజాంరాష్ట్రమునకుఁ జేరిన నల్లగొండజిల్లా జనగాముతాలూకా విసునూరుగ్రామనివాసులును 72 ఊళ్ళకు దేశముఖులై దానికిఁ దగిన దర్పగాంభీర్యాదులును బలుకుఁబడియు సున్నతోద్యోగుల మన్ననయుఁ గలిగి మహైశ్వర్యవంతులైయున్నవారును నగు రాపాక రామచంద్రారెడ్డి దొరవారు విక్రమ సం॥ మార్గశిర శు ౬ నూతనగృహప్రవేశమహోత్సవమును గావించియున్నవారు.

కం. మునియే డే నాయూరికి
 చనినపుడా రామచంద్రజననాథు గృహ
 మ్మునకుం బునాది యేర్పడి
 యెను. నిరు డే నేగుపటికు నేమనవలయుఁ!

సీ. చుక్కలం జూచుచు శుభ్రసౌధాగ్రంబు
 గవ్వూతి మేరనే కానవచ్చె.
 ఊరిలోపలికేగి సొగు గాంతునుగదా
 వాలవు చెప్ప లేవటకుఁ గనుల.

మేడలో పలికెఁ బో గోడగోడను నాదు
ప్రతిబింబమే కానఁబడఁగఁదొడఁగె.
అబ్బురంపడి యంత నటునిటు తిరుగుచో
స్ఫటికంపు టడుగురాల్ జాఱనయ్యె.
మఱి యెలెక్ట్రిక్లైట్లు మందిరాంతర్బహి
స్థలుల లెక్కఁబెట్ట నలవి కావు.
ఇట్టు తద్గృహంబు కట్టఁగాఁబడునాఁడె
ఎలమి కల్పవరింత గొలిపె నాకు.

మూడంతస్థులు. ఆపై నావరణరహిత విహారభూమి. ప్రతియంతస్తునను నిరుపార్శ్వముల నెన్నియో చిత్రవిచిత్రనిర్మాణములు. చల్లనీళ్ళపంపులే కాక వేడినీళ్ళపంపులు, స్నానపుగదులు, జపగృహములు, శయనగృహములు, విలాసవేశ్మములు, బంధుమిత్రుల భవనములు, రాజకీయోద్యోగుల రమ్యప్రదేశములు మరపంకాలు అవి యివి యననేల? అఖిలసౌకర్యములును గలిగి యర్జునున కర్పింపఁబడిన మయసభను స్మరింపఁజేయు మందిరమునఁ బ్రాగుక్తశుభదినమున రామచంద్రారెడ్డిగారు తాము ప్రవేశించి ధరణీసురాశీర్వాదపురస్సర తండులాక్షతలు తలఁ దాల్చిరి. ధన్యులైరి.

ఉ. తోఁపఁగ నింద్రవైభవము తోడిమహీశశతంబుతోడ నీ
భూపు గృహప్రవేశ మది పొల్పువహింపఁగ నయ్యెనంట ల
క్షోపరి యన్నదానమఁట. యుర్విసుపర్వుల వేయిచేతులన్
రూపికలం బదింబదిగ రోసి మఱిం గురియించెనం టహో!

సీ. ఒకటిరెండును మూడు నొసఁగినవాఁడఁట
భూరిసంభావనయే రహింప.
పద్యమ్ములం జెప్పఁ బద్మలైదు లిడెనంట
రాణఁ గామేశ్వరరాయముఖుల.
కిరువదిరౌప్యంబు లీయంగఁబడెనంట
సుమతి నారాయణజోస్యులకును.
పంచవింశతి యిచ్చి పైన సాలును గప్పి
రహిఁ బంపెనఁట యల్లరంగరాజు.
నిఁక భుజంగరాట్కవీశు ప్రాగల్భ్యవ
కవధి లేనె లేదఁ టహహ రామ
చంద్రసింధుమేఖలేంద్రుఁడు స్వగృహప్ర
వేశసమయమందు విశ్రుతముగ

ఆ. వె. తద్గృహప్రవేశ తరుణమ్మునను నాకు
నుత్తరంబుఁ బంపియుండఁబోలు.
కాని సిద్దిపేట కేను శ్రీ శివకోటి
ఉత్సవమున కేగియుంటి నపుడు.

తే. గీ. అవునుగాక గృహప్రవేశవిధిసత్కృ
తికి వహించి ప్రధానపోషకత యస్మ
దభినవసరస్వతిని వేగ నర్హపాత్రి
మును బొనర్పఁగలందు తదుద్భవరుండు.

కం. తనమేడ మూఁడవంత
స్తున నినుఁ డుదయించునపుడె శుచిర్మై నిత్య
మ్మును జపియింపఁగఁబడు న
మ్మనురాజ మనామయముగ మనుచుత మితనిన్.

— కాశీనగరము —

(పింగళి లక్ష్మీనారాయణగారు)

... కాశిని గుఱించినవిషయములు సవిస్తరముగా వ్రాయఁబడెనచో నొక గ్రంథమే యగును. హైందవనాగరకతయొక్క చరిత్రను జెప్పినట్లగును ..చిత్రమగువిషయములు. వినినంతమాత్రమున బోధపడని విషయములు. ఏగ్రంథములోను లేక ప్రజల జీవితమందే ప్రతిష్ఠింపఁబడిన విషయములు. అనేక గ్రంథములలో నుండి మహానుభావులచేఁ జెప్పఁబడి జ్ఞానిలోకముచేఁ గొనియాడఁబడి కాశీవాసులచే నిరాకరింపఁబడెడి విషయములు.

పురాతనములలోఁ బురాతనము. హరిశ్చంద్రునినాఁడు మహాపట్టణము. పాండవుల కాలమందు హిందూక్షేత్రము. బుద్ధుని కాలమం దార్యావర్తమునకెల్ల గొప్పపట్టణము. చీనాదేశమునుండి యేడవశతాబ్దము పూర్వార్ధమందు యాత్రికొఱకు విచ్చేసిన హీన్ త్సాంగు వ్రాసినట్లు హిందూస్థానమందలి వాణిజ్యమున కంతకుం గేంద్రస్థానమైన మహాపట్టణము. వరుణ యసి యనెడు రెండు నదులమధ్యనుండి వారాణసియని పేరుగాంచిన పట్టణము. ఒకనాఁ డేఁబదియడుగుల లోఁతునఁ బాఱినది నానాఁటికి మేటవేసినది. ఇపు డసీనదిమీఁద లక్షలు వెచ్చించి గొప్ప భవనములను నిర్మించుచున్నారు. మఠములను గట్టుచున్నారు. నూతనదేవాలయములు ప్రతిష్ఠచేయఁబడినవి. ఇదియంతయుఁ బందొమ్మిదవ శతాబ్దమునందు సాధ్యమైనది. పూర్వము చక్రవర్తులు నివసించిన స్థలములు పాటిపెరకులుగా మాఱిపోయినవి. అట్టిప్రదేశములం దిపుడు కూరగాయతోఁటలున్నవి. వ్యాసులు తపసుచేసి నివసించిన పట్టణప్రాంతము పాడుపడి నిర్జనమై చెఱకుఁదోఁటలకుఁ బోలమైనది. ఉత్తరప్రాంత మొక మైలువఱకుఁ బ్రాముఖ్యమును గోల్పోయి

పాటకప్రజనములకు నివాసస్థానమైనది. దక్షిణమున సూంచేడ్లలో రెండుమైళ్ళవఱకు నది వెంబడి ప్రాఁకినది. ఇక్కడనే యిప్పుడు హిందూవిశ్వవిద్యాలయము నిర్మింపఁబడినది. ఈ సంస్థక్రింద నింతవఱకు రెండు కోట్లు వెచ్చింపఁబడినది. మఱియొక రెండు కోట్ల ధనమును సంపాదించి దీనిని బూర్తిఁజేయనున్నారు. సామాన్యముగా నితరపట్టణముల పెరుఁగుతఱుఁగులను బరిశీలించి చూచినయెడలఁ బ్రతిపట్టణము రైల్వేస్టేషను వైపునకుఁ బెరుఁగుచుండును. కాశిలోనో రైలున కత్యంతదూరములో నున్న స్థలములే యభివృద్ధిఁగాంచుచున్నవి. నదివెంబడి నైదు మైళ్ళ పొడవుగల పట్టణము. నది యెంతపొంగినను బ్రజలకు భయములేని పట్టణము. నీటిమట్టము కేఁబది మొదలు నూఱడుగులవఱకు నెత్తుగల యొక యతివిశాలమగు కట్టమీఁదఁ గట్టఁబడిన పట్టణము.

పురాతనమన నేమి? ఇంగ్లాండు ప్రజావంతము గాకమునుపు రోమనుమహాపట్టణమును గట్టుటకు మునుపు పరిసియాప్రభువులు గ్రీసుదేశముపై దండెత్తుటకు మునుపు ఆథెన్సురాజ్యము తన యాధిపత్యముక్రింద యవనసామ్రాజ్యమును నిర్మించుటకు మునుపు •••విద్యలకు వాణిజ్యమునకు విత్తమునకు వైభవమునకుఁ గళలకుఁ గర్మాగారములకు నగ్రస్థానముగాంచిన పట్టణము. 800 మైళ్ళ కైవరముగల రాజ్యమున కనేకశతాబ్దములవఱకు ముఖ్యపట్టణము.

వ్యాసుఁడు దనగ్రంథముల నిచటఁ దొలుదొల్తఁ జదివి ప్రజలకు వినిపించి పురాణములఁ జెప్పెను. ప్రసిద్ధిగాంచెను. ఆయన పురాణములను ద్వాదశినాఁడు చదువుచుండెను. ఆనాఁ డందఱుఁ దమ కాలక్షేపములఁ గట్టిపెట్టి వినఁబోవుచుండిరి. ఇప్పటికి మన మెంత బ్రతిమాలినను నెంతసొమ్మిచ్చినను గాశిలో నెవరును ద్వాదశినాఁడు పురాణమును జదివి వినిపించరు. బుద్ధుఁ డీమహాపట్టణమును గెల్చెనఁ గాని తన మతము దేశమునందు వ్యాపింపదని శక్తి ధారఁబోసి గొప్ప ప్రబోధము గావించెను. ఆయన నివాసముకొఱకుఁ గట్టఁబడిన మఠము మఱి యనేక బౌద్ధశిథిలములును శారానాథములో నుండుటచే బౌద్ధులనేకులు గుంపులుగుంపులుగాఁ గాశీయాత్రఁ జేయుచున్నారు. ఇప్పటికిని జైనుల కొక గొప్ప మఠమున్నది. ఇది దక్షిణప్రాంతమున. వీరికి భూతదయను గుఱించి పట్టుదల గలిగియుండుటచే నాప్రాంతమందు గంగలోఁ జేఁపలఁబట్టుట మొసళ్ళను దుపాకులచేఁ గొట్టి వేటాడుట సర్కారుచే నిప్పటికిని నిషేధింపఁబడుచున్నది. ఈ పట్టణము బౌద్ధమతమునకు లోనైన వెంటనే హైందవవిద్యలు క్షీణించి బ్రాహ్మణుల బ్రతుకు తలక్రిందగుటయే కాక పట్టణముగూడఁ గృశించి కొన్నిశతాబ్దములవఱకుఁ బ్రాముఖ్యమును గోల్పోయి యుండినది.

శ్రీ శంకరాచార్యులవారు రామానుజాచార్యులవారు జీవితములను విస్తారముగా నుత్తరభారతదేశమందే గడపిరి. రామానుజాచార్యులవా రుత్తరదేశమందుఁగూడ లక్షల కొలఁది శిష్యవర్గము సంపాదించి వైష్ణవమతవ్యాపనము గావించిరి. శంకరాచార్యులవారు తన నిరుపమానమేధాశక్తిచే నన్యమతవాదుల నోడించి సనాతన మతమును దిరిగి స్థాపించుటయే కాక కాశీపట్టణమును సంస్కృతవిద్యను మహోన్నతపదవికిఁ దెచ్చిరి. ఆనాఁటి నుండియు మతస్థాపకులందఱును గాశికి వచ్చి తమ మతములను బ్రకటించుకొనుచుండిరి. చైతన్యస్వామి వంగదేశమునుండి కాశీనగరమున కేతెంచి కొంతకాలమునుండి తన ప్రేమతత్త్వమును బ్రజలకు బోధించుచుండెను. భక్తాగ్రేసరుఁడని పేరుగాంచెను.

కబీరుదాసు భక్తిమార్గమును హిందూస్థానమందు వ్యాపింపఁ జేయుటకును హిందూ మహమ్మదీయ సమీకరణము గావించుటకును గాశీనగరమును నివాసముగాఁ జేసికొని యుండెను. శృంగగిరిపీఠాధిపతి కిక్కడ నొక గొప్పమఠ మున్నది. ఇప్పటికి దానియం దనేకులు భక్తులున్నారు. అట్లే రామానందుఁడును వల్లభాచార్యులును గొంతకాలము కాశీవాసము గావించి తమ మతములను వ్యాపింపఁజేసికొనిరి. హిందీభాషకు నూతనవికాసమునిచ్చి నిత్యత్వమొసఁగిన తులసీదాసు చిరకాల మిచ్చట నుండెను. ఆయన స్నానముఁజేసి యక్కడనే సూర్యోదయకాల మంతయుఁ గడపుచువచ్చిన ప్రదేశమును దులసీదాసఘట్టమని వాడుచున్నారు. ఇది హరిశ్చంద్రఘట్టమునకు సమీపములోనే యున్నది.

గంగానదియొడ్డునఁగల భక్తిచేతను గాశీవాసమందుఁగల విశ్వాసముచేతను ఇండియాలోనుండు ననేకసంస్థానాధీశులకును బీరాధిపతులకును గోటీశ్వరులకును సుచితనివాసభవనములు విశాలమగు మఠములుఁ గలవు. నేపాలు తిరువాన్కూరు కాశ్మీరు మైసూరు ఇండోరు, కొచ్చి, దర్భాంగ, విజయనగరము, మొదలగు సంస్థానముల కధిపతులు వారి కుటుంబములుఁ దఱచుగాఁ గాశీవాసముఁ జేయుచుందురు. బొంబాయి కలకత్తా నగరములలోఁ బేరుగాంచిన ధనికు లనేకులు నివాసముల నేర్పఱచుకొనిరి. వీరందఱికి డిల్లీలోఁ గాని సిమ్లాలోఁ గాని నివాసములు లేవే? కనుకఁ గాశీనగర మిండియాకు హృదయము వంటిది. మాళవ్యాగారి నగరమందుఁగల ప్రతిష్ఠచేతనే హిందూజాతి కంతకు నాయకుండనిపించుకొనెను. ఈ కారణముచేతనే కాశీవిశ్వవిద్యాలయమునకొఱకు రెండు కోట్ల ధనమును సంపాదించఁగలిగెను. ఇందుచేతనే కాశిలోని పండితులు గొప్ప మేడలను సంపాదించఁగలిగిరి. కాశీనగర మొక జాతీయసంస్థ. ప్రజ లందఱు నిండియాలోని నానారాష్ట్రములందుఁగల ప్రజల సొమ్ముచేఁ బోషింపఁబడుచున్నారు. ఇక్కడ నేయఁబడు పట్టువస్త్రములు బెజవాడ కుంభకోణము పునహా మొదలగు పట్టణములలో విక్రయించఁబడుచున్నవి. యాత్రికులు కొనిపోవు పట్టువస్త్రములు విగ్రహములు పాత్రలు ననేక లక్షల విలువ గలిగియుండును.

ఇఁకఁ బట్టణమును వర్ణించిచూతము. ప్రాతపట్టణమందుఁగల మేడలు చాలఁ బెద్దవి. వాని యావరణములు చిన్నవి. నాలుగైదంతస్తులుగల మేడ లనేకము లున్నవి. షుమారు మూడువందల గజముల స్థలములో నిరువదికుటుంబములు నివసించుటకు వసతులుండును. పెద్దవీధులు రెండే. ఒకటి రాజఘాటురైల్వేస్టేషనునుండి విశ్వవిద్యాలయము వఱకు 5 మైళ్ళ పొడవుగలిగియున్నది. రెండవరోడ్డు దశాశ్వమేధఘట్టమునుండి కంటోన్మెంటు... వఱకు మూఁడుమైళ్ళపొడవుగలది. ఇక సందులు గొందులు గల్లీలు వేల కొలఁది గలవు. బండ్లునడుచుటకు వీలులేదు. మోటారుకార్లకు వెడల్పు చాలదు. ఇఱుకుచేతను జనసమ్మర్దముచేతను బైసికిలుకు వీలులేదు. బావులు లేవు. గంగాస్నానముఁ గాలి నడక తప్పనిసరి. ఒక్క గజములోనే యొక యాలయము. ఇట్టివి షుమారు వేయి లింగ ప్రతిష్ఠలు. నాలుగుగజముల చతురస్రతలముగల దేవాలయములు షుమారు నూఱుండును. అన్నిటిలోను నిత్యము నభిషేకములుఁ బూజలు జరుగుచునే యుండును. ఇరవదియైదు కోట్ల హిందువుల భక్తికి గుఱియైన విశ్వేశ్వరాలయము 500 గజముల స్థలములోఁ గట్టఁబడినది.

ఈదేశమందు గొప్ప గాలిగోపురములు లేవు. విశ్వేశ్వరాలయ గర్భము షుమారు పదియడుగుల చతురస్రతలము. నాలుగువైపుల ద్వారములు. ఈయాలయ మిండోరురాణి

యగు నహల్యాబాయిగారిచేఁ గట్టింపఁబడెను. ఈదేవాలయము సుమా రిరువదియడుగుల యెత్తుండును... ఒకయడుగు లోఁతుగలిగి నలుప్రక్కలను మూడడుగుల పొడుగు గల యొక చదరపు గుంటలోఁ బ్రతిష్ఠింపఁబడినది. ఒకబిందెతో నీళ్ళు పై వ్రేలాడఁగట్టఁబడును. ఆబిందెకుఁ గ్రింద నొక చిన్న రంధ్ర మమర్చఁబడినది. ఈవిధముగా నిరంతరాభిషేకము జరుగుచుండును. ప్రతిదినము షుమారు రెండువేలమంది దర్శనమునకు వచ్చి పోవుచుందురు. కొన్నిపండుగదినములలో దర్శనము చాలఁ గష్టపడినఁగాని దొరకదు. ప్రతిగుడియొద్దను బ్రతిసందులోను బ్రతిగొందిలోను నావులు నాఁబోతులు సన్యాసులు వితంతువులు యాత్రికులుఁ గాననగును.

నలువదిచదరపుమైళ్ళ భూమి మహాక్షేత్రముగాఁ బరిగణింపఁబడుచున్నది. ఈక్షేత్రము ప్రత్యేకధర్మముచేఁ బాలింపఁబడుచున్నది. ఈభూమి యముని యధికారాపరణములోఁ జేరియుండలేదు. ఇది కాలభైరవుని యధికారస్థానము. అష్టభైరవు లెనిమిది దిక్కులనుండి యీపుణ్యభూమిని గాపాడుచున్నారు. అందుచే యాత్రికు లెనమండ్రుగురు బ్రాహ్మణులకుఁ బంచభక్ష్యములతోఁ దృప్తియగు భోజన మిడి మంచిదక్షిణ ముట్టఁజేసెదరు. ఈకార్యమునకే కాలాష్టకమని వాడుక. కాలాష్టకముల కందఱుఁ బోరు. కాశిలోఁ బరాన్నాన్వేషణతత్పరులు మూఁడువందలమంది కలరు. వీరిలో నేఁబదిమంది మరలమరల భుజించు మహాభోక్తలై యున్నారు. ఈనాఁడు కాశీనగర మనస్సులకు నివాసముగాలేదు. అన్నదానము క్రమముగా క్షీణించుచున్నది.

కాశీవాసమును వ్రతముగాఁ బూనియున్నవారు దాదాపు నలువదివే లుండనగును. వంగదేశస్థులే రమారమి యిరువదివేలమంది కలరు. మహారాష్ట్రులు నాలుగువేలమంది. ఆంధ్రులుఁ గన్నడదేశస్థులుఁ దమిళదేశస్థులుఁ గలసి వేయిమంది రమారమిగా నున్నారు. ఆంధ్రులు రమారమి నూఱుమంది. వీరందఱు మద్రాసురాజధానినుండి వచ్చినవారే. ఇక్కడివారు వీరినిగుఱించి యతిలాఘవముగా మాటలాడుదురు ... కాలాష్టక ... భోక్తలు యాత్రికుల కెదురుపోయి ... కమీషనుపుచ్చుకొను సరఫరాదారులు వితంతువులు సన్యాసులుఁ జాలఁ జెడువాడుకతో నున్నారు. సన్యాసులుగూడ యాత్రికులను గుఱించిన లాభవ్యాపారమునందుఁ బూర్తిగాఁ బ్రవేశించియున్నారు ...

పూర్వము యాత్రలు ప్రవాసము గల్పించుచుండెడివి. కాలినడక నాఱుమాసములలోఁ గాశికిఁ జేరుచుండిరి. యాత్రల గృహాదులను బంధుమిత్రులను గుటుంబములను విడిచి సుఖములకు నహంకారమమకారములకు దూరస్థులై యనేక నూతనవిషయములను జూచి పరిశోధించి నేర్చి భక్తిజ్ఞానవైరాగ్యముల సమకూర్చుకొని పూర్తిఫలితమును గాంచిరి. ఇపుడు రైలులోఁ గదలకుండఁ గూర్చుండి పరుపులమీఁద హాయిగాఁ బరుండి ప్రతి పెద్దస్టేషనులోను మంచిమంచి భక్ష్యములను బానీయములనుగొని తిని త్రాగి మూఁడవ నాఁటికి గయకుఁ జేరి గౌతమబుద్ధుఁడు స్వస్వరూపదర్శనము గాంచి రాజ్యమును సకల సంపదలను విడచిన స్థలమందు నిలిచి యడ్డాకులవిస్తళ్ళనో గోంగూరనో త్యజించి మహాత్యాగులై యాత్రలఁ జేయుచున్నారు. యాత్రలందు వివిక్తదేశసేవిత్వము నేకభుక్తి ... మొదలగునవి ... ఊర్ధ్వగతికిఁ దోడ్పడెడివి. చిత్తశుద్ధి యంతఃకరణనిష్ఠ ప్రభవింపకున్నఁ బుణ్యోదకులందు స్నానము రుద్రాక్షధారణము మొదలగు బాహ్యతంత్రములచే మానవులు తరింపఁజాలరని పెద్దలు వ్రాసిన గ్రంథములలో నున్నను వేలకొలఁది

భక్తులు కాశీలో మరణించినమాత్రముననే మోక్షము ప్రాప్తించునని నమ్మి కాశీవాసము చేయుచున్నారు.

...ఆంధ్రదేశమందు దృష్టిస్పర్శదోషములను గుఱించి యతి కఠినమగు కట్టుబాట్లు కలవు. ఇపుడు దేశసేవకులు గాంధిమతస్థులు స్పర్శనుగుఱించి చెప్పునుపన్యాసముల వినినవారికి స్పర్శయే యొక పుణ్యముఁ బురుషార్థమునని చెప్పుచున్నటులఁ గనుపించును. కాని మహాత్ముని కట్టి యభిప్రాయ ముండనేరదు. స్పర్శచేతనే వ్యాధులు వ్యాపించుచున్నవి. పూర్వులు మడుగునకుఁ బోయి యెవరివస్త్రములు వారే శుభ్రపఱచుకొనుచుండిరి. ఇపు డందఱుఁ జాకలికి వేయుటయు మామావస్త్రములను పెద్దపెద్ద మూటలుగఁగట్టి బండిపైన వేసికొని, చాకలి కొనిపోయి శుభ్రపఱచుటలో ననేకవ్యాధులను వ్యాపింపఁజేయుచున్నాఁడు. రైళ్ళు, ట్రాముబండ్లు, పట్టణములో నివాసము, ఆస్పటలు, పూటకూళ్ళ కొంపలు, కాఫీక్లబ్బులు, మీటింగులు, మొదలగు నూతనసంస్థ లనేకవిధసంకరములను, బ్రబలపఱచుచున్నవి. మన సంఘనియమముల నెఱిఁగినవారి కొకరినొకరు ముట్టుకొనుట దోషమని తెలిసియే యున్నది. నిన్న కడకుఁ బోయిన స్త్రీని నేడు కడకుఁబోయిన స్త్రీ ముట్టుకొనఁగూడదు. మడితోనున్నవారుగూడ నొకరినొకరు ముట్టుకొనఁగూడదు. దంపతు లొకరినొకరు ముట్టుకొననగును. పిల్లలు తలిదండ్రుల ముట్టనగును. తగు సమయముఁ గారణములేనిది యొకయింటిలోఁగూడ నొకరినొకరు ముట్టఁగూడదు. అస్పృశ్యత యత్యావశ్యకమైన ధర్మము. కాని...ఉత్తరభారతమండలములలో నస్పృశ్యసత యొక్క ఘోరరూపములు కనిపించవు. చిన్న చిన్న పల్లెలందుమాత్రము పంచములను గుఱించి కొంత కొంత పట్టుదల కలదు...కాశీనగరమందు...సందులుగొందులున్నందున స్పర్శ ప్రమాదవంతముగా నున్నది. సంకరమును సహించవలసివచ్చుచున్నది.

ఇంటింటికి నీళ్ళపంపులున్నవి. కాని పెద్దకుటుంబములవారికిని గొప్ప కార్యములు సంతర్పణలు జరుపఁబడు సమయములందును బంపుచేఁ బ్రాప్తించు నీరు చాలదు...గంగ తెచ్చువా రున్నారు. వారిని, పానీవాలాయని పిలుతురు. భాగ్యవంతులగువారును పెద్ద కుటుంబములవారును, పానీవాలాను బెట్టుకొనక తప్పదు. పానీవాలాగా బ్రాహ్మణులుండుటలేదు. ఈ నీళ్ళ వంటలకుఁగూడ నుపయోగించెదరు. దేవతార్చనపరులుగూడ మడికి మైలకు నీ గంగనే వాడుచున్నారు. పానీవాలా తన కడవలతోనే నీరు పట్టుకొనిపోయి పోసివచ్చుచుండును. ఈ గంగను వృద్ధలగు వితంతులుగూడ వాడుకొనుచున్నారు. ఇది రహస్యవిషయము గాదు...

కాశీలోఁ బ్రజ లందఱు నొక్కపూటమాత్రమే పప్పు కూర యన్నము భుజించుచున్నారు. రాత్రులందు సామాన్యముగా నిప్పుఁజేసి వంట చేయరు. బజారులోని ఫలహారములనే భక్షించెదరు. నూఱురకముల పిండివంటలను జేసి దుకాణములలో విక్రయింతురు. ఇదిగాక యీ దేశమున నన్ని ధాన్యములను వేయించి పేలాలుగను, వానిని విసరి పిండిగను నమ్ముచుందురు. ఇట్టిపిండిని సత్తసి పిలిచెదరు. ఏధాన్యముసత్తు కావలెనన్న నా ధాన్యపుసత్తు నమ్మెదరు. ముఖ్యముగా నేకాదశి యిక్కడ నియమదినము. ఆనాఁడు దుకాణములు బందు. షాపులు బందు. కాని భోజ్యముల నమ్మువారు తీసియుంచెదరు. ప్రతిసాయంకాలము నేకాదశినాఁడు నన్నసత్రములు బందు. కనుక దుకాణములకుఁ బోయి నానావిధభోజ్యములను గొని తిననగును. వితంతులు వైదికులు పండితులు నందఱు బజారుసరకులనే భుజించుచున్నారు. వీనిని ద్విజులు చేయరు. ఆంధ్రదేశమందువలె వైశ్యులు భోజ్యములను జేసి సామాన్యముగా విక్రయించువారు లేరు...

తే. మేను పేరిటి పెనుగోతిలోన దాగి
వేశలాకృతితోఁ గానుపించుచుండు
భోగతృష్ణాపిశాచి యెప్పుడును మమ్ము
మోసగించుచునున్నది. మునివతంస! 175

తే. అకట! యీపాడు దేహంబునందె యాస్థ
గల మృషాజ్ఞాన మనుకురాక్షసి చలంబు
తోడ ననవాయయ్యైన సద్బుద్ధి నెపుడు
వంచనమొనర్చి దైన్య మొందించుచుండు. 176

చ. కనఁబడునట్టియీజగమె కల్ల యగుంగద! యింక దీనిలో
న నిమిడియున్న యీతనువనంగను సత్యమె! యిట్టులయ్యు దీ
నినె నిజమంచు నమ్మి యవనీజను లెల్ల నిరంతరంబు వం
చనములఁబొందుచుందు రిది సంయమినాయక! చిత్రమౌఁగదా! 177

కం. సెలయేటి నీటిబిందువు
వలె నెండిన పండుటాకు వడువున మఱియుఁ
జలబుద్బుదంబుగతి, ని
ష్ఫలమై పడిపోవుఁ దనువు త్వరలోనె మునీ! 178

ఆ. శారదాంబుదములఁ జంచలాలతల గం
ధర్వనగరములను స్థైర్య మెవఁడు
నిర్ణయించు నతఁడు నెరనమ్ముఁగాత, దే
హమ్ము, నొరులు దీని నమ్మరాదు. 179

వ. కావున మిథ్యాఽజ్ఞానవికారంబును స్వప్నసంభ్రమపత్తనంబును స్ఫుటతరాపాయంబును ప్రబలదోషసమన్వితంబును నగు నీకళేబరంబును దృణంబుగతి నిరసించి సుఖంబుండువాఁడ. దేవా! యిట్టి దేహంబునకు సంభవించు వివిధావస్థలయందు బాల్యం బానందదాయకంబని కొందఱు తలంతురుగాని. 180

—♦ బాల్యనింద ♦—

తే. కార్యభారతరంగ సంఘాతకలిత
చంచలాకార సంసారజలధియందు

జంతుసంతతి మానవజన్మ మెత్తి
బాల్యమును బొందుటయు వెతల్ పడుటకొఱకె. 181

ఉ. ఆపద, శక్తిహీనత, దురాశయు, మూకత, మూఢబుద్ధియున్,
చాపల, మార్తి, లోభమును సర్వము నీ శిశుభావమందె సం
స్థాపితమై తనర్చుననఁ దాపసనాయక! యింతకంటె సం
తాపకరం బొకండు కలదా? వలదా విసువంద దీనిపై. 182

ఉ. రోసమునందు దైన్యమున రోదనమే శరణంబుగాఁగ వి
ద్యాసితడోలికాంతరమె వాసముగాఁ గడు నస్వతంత్రతన్
గాసిని ముంచి కంబమునఁ గట్టిన దంతివిధాన మానవున్
జేసెడి శైశవంబు మునిసింహ! సుఖప్రద మెట్టులయ్యెడిన్. 183

క. మునినాథ! శైశవంబున, మనుజుఁడువడునట్టి వెతలు మఱియెట్టియవ
స్థను బొందఁడనఁగ నిది సుఖ, మను వారలకంటె మూర్ఖు లవనిం గలరే?

ఉ. అద్దమునందుఁ గానఁబడు నాకృతులన్ దలపించు మోహముల్
తద్దయుఁ గూర్చుచున్, బలుతలంపులఁ బెంపొనరించు, చందులో
నెద్ది లభింపకున్న వగ నేడ్చెడిమానస మొప్ప నిత్య మా
పద్దశలందు మున్గు శిశుభావము సౌఖ్యద మేరి కయ్యెడిన్? 185

తే. శైశవంబున నగ్నిచే జలముచేత
గాలిచే మాటి మాటి కజ్ఞానవశతఁ
గలుగుచుండెడి భయ మెట్టిసిలుగులందు
నైన మనుజుల కొదవునే మౌనిచంద్ర! 186

ఆ. దుర్విలాసయుతము, దుష్టాస్పదంబు, వ్య
ర్థక్రియాచయాభిరతము నైన
శైశవంబు తలఁప శాసింపఁబడుటకే
కాని శాంతికొఱకుఁ గాదు సుమ్ము. 187

ఆ. అఖిలదోషములును నఖిల దురాచార
ములును నఖిల దుర్వ్యథలును గూడి
బాల్యమంద యెపుడు బసచేయుఁ జీకటి
గొందిలోన గ్రుడ్లగూబ లట్లు. 188

క. పసితనము రమ్యమంచును, బొసఁగన్ వచియించువ్యర్థబుద్ధుల మూర్ఖా
గ్రసరుల హతచిత్తులఁ దాపసవర! యేమనినఁగాని పాపము గలదే?

క. ఎందున్ నరు డెందము డోలాందోలితవృత్తినుండు నల బాల్యం బా
నందద మగు టెట్లు? జగంబం దెల్ల నభవ్యకరమ యగుఁగాక మునీ!

తే. ఒక్క మనుజులకే కాదు నిక్కువముగ
నెల్లసత్త్వంబులకు నిల నెల్లదశల
కంటె శైశవమం దధికంబు చాప
లంబు పదిరెట్లుగా మానసంబు కాంచు. 191

ఆ. సహజముగ మనంబు చాంచల్యసహితంబు
శైశవంబు మఱియుఁ జంచలంబు
ఇట్టి రెండు నొకట నేకమై నిలిచిన
రక్షకుం డెవం డరాతిదమన! 192

తే. వెలఁది బిత్తరిచూపులు వీచికలును
వహ్నికీలలు నూత్నశంపాలతలును
జాపలం బభ్యసించినజాడ దోఁచు
శైశవాక్రాంతజన మానసముల చెంత. 193

తే. సతతచపలస్వభావత నతిశయిల్లు
శైశవంబు మనంబును సర్వవృత్తు
లందుఁ బరికించిచూచిన నన్నదమ్ము
లట్టు గనుపట్టుచున్నవి యఘవిదూర! 194

క. తిర్యగ్జంతువువిధమున మర్యాదాహీనవృత్తి మసలుచుఁ జిత్త
స్థైర్యంబు లేక హేయపుఁగార్యములొనరించు శిశువు గాధితనూజా!

ఉ. లీలల నాటపాటల మలీమసకార్యములన్ దురీహలన్
జాలఁగ మోహమందు నతిచంచలవృత్తిఁ జరించు వాంఛితా
ర్థాలి లభింపకున్న వగనందు నకారణభీతిఁ జెందు జం
బాలమునందుఁ బ్రీతిగను బాలుఁడు మోహలతాలవాలుఁడై 196

తే. అనుదినము నూతనముఁ బ్రీతిజనకమైన
వస్తువు లభింపకున్నఁ బెన్వగ మునుంగు

బాష్పశింఘాణ కర్దమపంకిలాస్యుఁ
డగుచు నింతకు నంతకు ననిశ మేడ్చు. 197

క. ఊరకె భయపడు, నెపు డాహారపరత దైన్యమందు, నలిజడమతియై
కోరును గన్నది కననిది పారెకుఁ దనుమానసములఁ జపలత మించున్

క. కోరినయర్థంబులు చే, కూరనియెడ మానసమునఁ గుములుచుఁ బడయన్
జేరక సిగ్గటి బిగ్గఱగా రోదన మాచరింపఁగాఁ గడఁగు మునీ! 199

క. వశుఁడగు నించుకలోనె వివశత నొకింతనె వికారపరుఁడగుచుండున్
శిశు వతిసంతోషంబున నశుద్ధమున శునకమట్టు లాటలనాడున్ 200

క. బలవంతమును మనోరథ విలసనకలితమును నయిన స్వీయమనము చేఁ
బలుగతుల బాలుఁడు వనస్థలి గ్రీష్మముచేతఁబోలెఁ దాపమునందున్

క. బడిలోనఁ బారతంత్ర్యము గుడుచుచు బలు తాడనము లగురువుల చేతం
బడయుచు బుడుతఁడు కష్టం, పడు నాలానంబునన్ ద్విపంబు విధానన్

ఆ. సంతసంబుతోడ జగ మెల్లఁదిన నెంచుఁ జంద్రుఁబట్టఁదలఁచుఁజదలనుండి
వీఁక తెక్కలెత్తి యాఁకొన్న వేళలఁ బైకి నెగురఁగోరుఁ బక్షిరీతి.

తే. అంతరంబున శీతాతపాది వేదనాన్వితుండయ్యుఁ దద్వారణాసమర్థుఁ
డైన శిశువునకుర్వీరుహంబునకును, అంతరం బేమి కలదు? మహానుభావ!

ఆ. తల్లివలన భీతి తండ్రివలన భీతి, ఇతరజనులవలన నెంతొ భీతి
అన్నవలన భీతి యాచార్యుచే భీతి, శైశవంబు భీతిసదనము గద!

క. చెడుకోరిక లీడేరమిఁ బొడమెడు క్రూరంపుదుఃఖములు సతతంబున్
బుడుతలఁ గారించెడు కైవడి నితరుల నొంపలేవు పరమమునీంద్రా!

ఆ. ఇంతనుడువ నేల? యెల్లతోసంగులు నెల్లదుఃఖములు మహీసురేంద్ర!
బాలునాశ్రయించి బ్రతుకుఁ బేదజనంబు ధనికు నొద్దఁ జేరి మనువిధాన

వ. కావున సకలదోషదశావిహతాశయంబును నవివేకనిలయంబును
నగు బాల్యం బెవ్వరికేనియుం బరితుష్టి గలిగింపమి నిక్కంబని
పలికి రఘుపుంగవుండు మరల నిట్లనియె. 208

—♦ పసిపిల్లలఁ బెంచు నేర్పాటులు ♦—

ప్రసవానంతరము 3 దినములు చనుఁబా లెవరివో తెచ్చియు నావుపాలు కొని తెచ్చియు శిశువులకుఁ బోయుదురు. ఇక్కాలంబున బాలెంతరాలికడఁ బాలుండవని సామాన్యస్త్రీలు తలంతురు. కాని యేస్త్రీల పాలో తెచ్చిపోయుట శిశువులదీర్ఘాయుర్భాగ్యమునకు భంగకరమని పండితులు కనిపెట్టియున్నారు. పరమేశ్వరుఁడు సర్వజంతువులకువలెనే మానవులకును గాలోచితాహారమును మాతృస్తన్యమున నిమిడ్చియే శిశుజన్మ మొనరించుచున్నాఁడని తెలిసి వారానందించుచున్నారు. ఇది పరమ రహస్యము. ముఱ్ఱుపాలు శిశువుల దృఢగాత్రుల నొనరించి దీర్ఘాయుష్మంతులఁ గావించును గానఁ దల్లి స్తన్య మిప్పింపుఁడు.

మొదటి నెలలోఁ బగలు గంటన్నర కొకసారియు రాత్రులు 3 గంటల కొకసారియు రెండవ నెలలోఁ బగలు రెండుగంటల కొకసారియు రాత్రులు నాలుగు గంటల కొకసారియుఁ బాలిచ్చుచుఁ దుదకుఁ బగలు నాలుగుగంటల కొకసారి యిచ్చుచు బిడ్డ యెదిగినకొలఁదిఁ గాలవ్యవధి హెచ్చుచేయుచు రావలెను. నియమితకాలమునకుఁ దల్లి యెడముకలుగఁ బాలిచ్చుచుండిన బిడ్డల కది యలవడి యితరకాలములందుఁ బాలకొఱ కేడ్చుట మానెదరు, ఎప్పుడైనను వారేడ్చినప్పుడు చీమ దోమ నల్లి కుట్టుటగాని చలిగాని మఱియొకవిధమగు బాధకాని కలుగుచుండును. అట్టితరుణముల వానింగనిపెట్టి బాధఁ దొలఁగించి యూఱడించుచుండవలెను గాని కాలపరిమితి తప్పి పాలీయరాదు.

పాలిచ్చుదినములందు శిశువుల కనుకూలములగు పదార్థములే తల్లి భుజించుచుండవలెను. బలకరమగు పిండివంటలు మొదలగునవి భుజింపరాదు. పగటివేళఁ దల్లి కూర్చుండి శిశువు తల పైకుండున ట్లెటవాలుగ నుంచియు రాత్రులందుఁ బరుండియుఁ జనుగుడుపుట శ్రేయస్కరి. పాలిచ్చునప్పుడు తల్లి యుల్లాసపూరితయై యుండవలెను. కోపశోకభయాదులం గూడి పాలిచ్చుట మానవలెను పాలిచ్చునప్పుడు స్తనములకు గాలి సోకనియ్యరాదు. నేఁటి కిది చాలును. నాకు సెలవొసంగుఁడు (అని వెడలిపోయెను)

(పదిదినము లయిన యనంతరము రాజనగరమునుండి గణపతిశాస్త్రిగారు తల్లిదండ్రులతోఁ గూడ వచ్చి నామకరణాదికము లొనరించుకొని స్వస్థానమున కరిగిరి. శిశువునకు వేణిబాయియని నామ మొనరించిరి. మరలఁ గొలఁదిదినములకు మంత్రసాని వచ్చి) పాలిచ్చుటం గూర్చి నేను మీ కెఱిఁగింపవలసిన యంశములు కొలదిగ నున్నవి, ఆలకింపుఁడని యిట్లు చెప్పఁదొడంగెను.

తల్లిపాలు చాలనప్పుడుమాత్రమే మఱియొక విధముగ శిశుపోషణ మొనరించవలెను. దాది నేర్పాటు చేయవలసివచ్చిన నాయావలి సాధ్యమైనంతవఱకుఁ దల్లి యీడుదిగను దగుపదార్థము లాహారించునదిగను గృత్యములందుఁ దల్లితో పాటుగ మాత్రము కష్ట మొనరించునదిగను నుండనిచో శిశువున కాపాలు సరిపడనేరవు. అన్నియుఁ గుదిరినను దల్లిపాలవలె సరిపడుట గొప్పయదృష్టమని చెప్పవచ్చును. ఆవుపాలు పోయవలసివచ్చిన నాపూటఁబిదికిన పచ్చిపాలలో గోరువెచ్చని నీరు

కొంచెముగ నొకటిరెండుచిటికెల పంచదారయుఁ జేర్చవలెను. ఆవుపాలు చిక్కనివియగుటచే నీరు కలుపకున్న నజీర్తిచేయును. మాధుర్యముకొఱయగుటచేఁ బంచదార చేర్చకుండిన శిశువులు సరిగఁ ద్రావరు. శిశువులెదిగిన కొలఁది పాలలో నీరు కలుపుట తగ్గించుచుండఁదగును. శిశువుల కుపయోగించు పాలనిచ్చు నావులను బొడి నేలయందును మంచు తగులనట్టియు వానకుఁ దడియనట్టియుఁ బ్రదేశములందును గట్టిచేయుచు వాతప్రకోపములగు మేఁతలుగాని సెనగలు, పత్తివిత్తులు, మొదలగునవి కుడితిగఁ గాని పెట్టక కనిపెట్టుచుండవలెను. ఎన్నివిధములఁ గనిపెట్టుచుండినను శిశుతత్త్వములకు సరిపడి యారోగ్యభంగము కాకుండుట గొప్ప యదృష్టమని చెప్పనగు.

కన్నతల్లి శిశువులకుఁ బాలీయక దాదులచే నిప్పించుటయు వాఱిరొకపాలు పోయుటయుఁ బిల్లల యారోగ్యమును నాయుర్భాగ్యమును నంతరింపఁజేయు నంతటి హానికరములనియు నట్టియేర్పాటు తల్లికిని నారోగ్యభంగ మొనరించుననియుఁ బలువురెఱుంగరు. అట్టివారు సంతానప్రాప్తిచేఁ గలుగఁదగిన సుఖసంతోషములఁ బూర్ణముగ ననుభవింపఁజాలరు. పోఁతపాలు శిశుమరణములకు ముఖ్యకారణమని చెప్పవలసివచ్చినందులకు విచారముగ నున్నది. తల్లిపాలు ద్రావెడువారలలో నూటికిఁ బదుగురకంటెఁ దక్కువశిశువులు మరణించుటయుఁ బాలుపోసి పెంచువారలలో నూటికిఁ బదుగురుమాత్రమే జీవించుటయుఁ జిరకాలముక్రిందటనే కనిపెట్టఁబడినది.

శిశువులకు నవమాసములు నిండినవెనుకఁ బాలు మఱపించు టుచితము. సామాన్యముగ నేఁడాదివెళ్ళినవెనుకఁ బాలీయరాదు. ఆఱవమాసము వచ్చినదిమొదలు స్తన్యమునకుఁదోడుగ నితరాహారము నభ్యాసపఱచి నవమాసములు నిండునప్పటికి దినక్రమమున స్తన్యము తఱుగునట్లును నితరాహారము చాలినంతగఁ దినునట్లును నలవాటుచేయవలెను. శిశువు నలఁతగ నుండిననే దశమాదిమాసములం బాలీయవలెను. ఆరోగ్యముగ నున్న శిశువులకు దశమాదిమాసములం బాలిచ్చుచుండిన వారి దేహములు బలహీనములై గుల్లబాఱిపోవును. పాలు మఱపింపఁదలంచిన తల్లి కొంచెము ముసాంబర మఱుఁగఁదీసి చనుమొనలకు రాచినఁ బిల్లలు ద్రావరు. మరలఁ గడిగి యనుకూలతరుణములఁ బాలిచ్చుచు శిశువుల నందుకు విముఖులఁ గావించి మఱచిపోవునట్లు లొనరించవలెను. ఇన్నివిషయముల నొకసంవత్సరకాలము కనిపెట్టి గమనించుట సామాన్యజనుల కలవిగానిదగుటచేతనే పసిబిడ్డను బెంచినట్లు కనిపెట్టుచున్నామని లోకమున సామెత ప్రబలియున్నది. ఒక కుటుంబమునంగలవారి కెల్లరకును భగవంతుఁ డొసఁగిన తెలివి దయాపూరితముగ నంతకనిపెట్టి యుపయోగించినను పసిబిడ్డను సరిగఁ బెంచుటకుఁ జాలదనిపించునంతటి కష్టసాధ్యమగును. ఇంతలత్యవసరమగు పని మఱియొకటి లేదు. ఇంటిశుభ్రతవంటి శుభ్రత తల్లియారోగ్యము. భోజనము, తుదకుఁ దల్లి యెండయందును వానయందును దిరుగుటగూడ శిశువు నారోగ్యమున భేదమొనరించుచుండును. తల్లి కజీర్ణము మొదలగు జబ్బులు కలిగినప్పుడు బిడ్డల కాపాలిచ్చిన

నాజబ్బులే శిశువుల కంకురించును. కావున నట్టితరుణముల నోరులచేఁ బాలిప్పించుట మంచిది. పాలిచ్చుటను గుఱించి కొన్ని మీకుఁ దెల్పియున్నాను. ఈసారి వచ్చినప్పుడు మఱియొకయంశముంగూర్చి నాచేతనయినంతవఱకుఁ దెల్పెదను.

దు:- నీవు వివరించిన యంశములలో మేమెఱుఁగనివి పెక్కు కలవు. వాని నన్నిటిని మేము చేతనయినంతవఱకు గమనించుచుండెదము. పసిపిల్లను బెంచుట కిప్పటి నుంచియు మేము తెలిసికొనవలసినయితర విషయములను మాకుఁ దోడనే తెల్పఁ గోరుచున్నాను.

కృ:- నే నీవిషయముల నిదివఱ కొక యుపన్యాసమునఁ జదివియుంటిని. ఇప్పుడు నీవు మరల వినిపించుటచే వాని యావశ్యకత చక్కఁగ బోధపడినది. ఇట్టివిషయములెన్నిసారులు వినినను దెలిసికొనినను సంపూర్తిగఁ దెలియుట దుస్తరమని నా తలంపు. మాయమ్మగారు కోరినటుల మేము ముఖ్యముగ నాచరించవలసిన యంశముల నుపదేశింపఁగోరుచున్నాను.

రం:- (వీరి సెలవు గైకొని యరిగి మరలఁ గొన్నిదినములకు వచ్చి తల్లిపిల్లల క్షేమాదికములారసి) మీరుకోరిన యితరాంశములం గూర్చి కొలఁదిగ వివరించెద నాలింపుఁడు.

శిశువుల కనుదినము స్నానము సేయించు టవసరమని యెల్లరు నెఱుఁగుదురు. కాని యనేకు లాచరించునటుల నుడుకునీరు స్నానము సేయించుటచే ననేక వ్యాధు లంకురించును. ఎప్పుడును మోచేయి భరింపఁగల వేఁడికంటె నధికోష్ణత కూడదు. వేసవికాలమున నీయుష్ణత యింకను దక్కువగ నుండునటులఁ గనిపెట్టుట మంచిది. ద్వితీయమాసము వచ్చినవెనుక శిశువు బలహీనముగ నున్నచో స్నానము చేయించు నుదకమునం జేరెఁడుప్పు వేసి యానీళ్ళు పోయుచు వచ్చినచో శిశువుకు బలము కలుగును. స్నానము చేయించక పూర్వము పాలీయ రాదు. చేయించినవెనుక నీయవలెను.

శిశువులకుఁ బండ్లువచ్చు సమయమునఁ గొన్నిజబ్బులు చేయును. కావున నట్టి తరుణములందును గొంచెము జాగ్రత్త కలిగియుండు టవసరము. పండ్లువచ్చునప్పుడు శిశువులకుఁ దఱుచుగ విరేచనము లగును. అట్టి తరుణములఁ గొంచెము చిట్టాముద మిచ్చినఁ బ్రేఁగునందలి మాలిన్యము విరేచనరూపమున వదలి యనంతర మట్టివిరేచనములు మానును. శిశువులకు మంచిగాలియుఁదగుమాత్ర మెండయు సోఁకునటులఁ ద్రిప్పుచుండినఁ బండ్లువచ్చునప్పుడు కలిగెడి జబ్బు లనేకములు తొలఁగును. ఆహారమిచ్చుపట్ల నీతరుణమునఁ గడు జాగరూకతకలిగియుండవలెను.

శిశుసంరక్షణమున ముఖ్యముగ జాగ్రత్తపుచ్చుకొనవలసిన యంశము వారి యారోగ్యము. కాలభేదముచేఁ గలుగుచుండు శీతవాతవ్యత్యయముల నుండియు, నవాంతరగండములనుండియు వారి కేవిధమగు ముప్పు రాకుండఁ గనిపెట్టియుండవలెను. వారి శరీరములు కోమలములైనటుల శక్తియుఁ గోమలము. జాగ్రత్తతోఁ గనిపెట్టి నడుపుచుండనిచో వారికిఁ దఱుచుగ నారోగ్యభంగము గలుగుచుండును. మీ కవసరమగువఱకు నాకుఁ దెలిసిన విషయముల వివరించితిని. మా వేణిబాయిగారి కన్నప్రాశనాదికము లైనవెనుకఁ దెలిసికొనవలసిన యంశములు

కొలఁదిగ నుండును. అవి తఱుచుగ నందఱు నెఱిఁగినవి. ఇఁక నాకు సెలవొసంగుఁడు.

కృ:- శ్రీమయానక యిన్ని యంశములు సులభగ్రాహ్యముగ మా కెఱిఁగించినందుకు నీయెడఁ గృతజ్ఞతగ నుండఁగలము కాని యన్యథా బహూకరింపఁజాలము (అని చెప్పి రంగసానిం బంపెను. వేణిబాయి కేడవమాసము వచ్చెను.

గణ:- (వచ్చి పిల్లను దల్లిని వెంటఁబెట్టుకొని పోయి కొన్ని దినములు జరిగిన యనంతరమున శిశువునకుఁ గొలఁదిగ నజీర్ణము కలిగి పాలు కక్కుచు రాత్రుల నిద్రించక యేడ్చుచుండుట, దగ్గుచుండుట తటస్థించుటయుఁ గొంచెముగ వైద్య మెఱిఁగియుండుటచేఁ దల్లిని దేలికయాహారమును దినునట్లేర్పాటు లొనరించి పెసరగింజంత మడ్డివెలిగారమును బొంగించి కాల్చిన పిప్పళిగింజం జేర్చి నూఱించి చనుబాలం గల్పి పోయించి యజీర్ణమును దగ్గును శమించునట్లొనరించి కొలఁది దినములకు భార్యతో) ఇద్దఱమ్మాయి కన్నప్రాశన మొనరించితిమి. అంతయో యింతయో దినదినము నాఁకించుచుంటిమి. దానింగూర్చి నీ వెఱుఁగవలసిన యంశములఁ గొంచెము వివరించెద. మన యవయవములన్నియు మితముగ మాత్రము పనిచేయఁగలవు. చేతులతోఁ గొంచెముకాలము పనిచేసిన నవి తీఁపెత్తి విశ్రాంతికోరును. కాళ్ళతో నడచుచుండినఁ గొంత విశ్రమించినం గాని నడవఁజాలము. అటులనే ప్రతిసాధనమునకుఁ బనిచేయు దార్ఢ్యము కలుగుటకుఁ గొంత విశ్రాంతి యవసరము. కనుక జీర్ణకోశమునకుఁ గొంత విశ్రాంతి కలిగినఁగాని భుజించిన పదార్థము నది జీర్ణముచేయఁజాలదు. ఒకసారి భుజించిన పదార్థమును జీర్ణముచేయుటకు మూఁడుగంటలు వ్యవధికావలెను. ఈ మూఁడుగంటలకాలమును జీర్ణకోశము విడువక పనిచేయుచుండును. అది మరలఁ బనిచేయ నారంభించుటకు మఱియొక మూఁడుగంటల విశ్రాంతి యవసరము గాన మన మొకసారి భుజించి మరల భోజనమున కరుగునప్పటి కాఱుగంటల వ్యవధి యుండవలెను. అట్టి వ్యవధి కలిగిననే చుఱుచుఱు నాఁకలి యగును. ఇంత మాత్రము వ్యవధి లేకుండఁ దినువారికి రుచియెట్టిదో యాఁకలియెట్టిదో తెలియదనవచ్చును. ఈ పైన వివరించిన యంశ మెఱిఁగిన మానవులకు వయసు చిన్నదైన కొలఁది కాలవ్యవధియుఁ దగ్గుచుండవలెనని తెలియవలెను. కాలనియమమును మితియును లేక శిశువుల కాహార మొసంగుచుండినను జిఱుతిండి పెట్టుచుండినను నారోగ్యము తప్పుటే కాక సోమరితన మలవడును. ఆరోగ్యము కోరువారు హితభుక్కులుగను మితభుక్కులుగను నుండు టావశ్యక మను సంగతి తల్లి జ్ఞాపకముంచుకొని బిడ్డలకును నలవఱచవలెను. నియమితకాలమున మితాహార మొసఁగుచుండినఁ బసిబిడ్డల జాడ్యము లాక్రమించక తొలఁగుట నిజము. కొలఁది కాలముననే వారు నందుల కలవడి నియమితకాలముననే పాలం ద్రాగుటకును నితరాహారము గొనుటకును నభిలషించుచుండుదురు. నియమము లేక యాహార మొసంగుచుండినచో నవసరము కలిగినపుడును లేనప్పుడును భుజించి మిగుల నాయాసపడుచుండురు.

-• అవధానముదిఱుఁడై యప్పయ్య నాకు బిడ్డనిచ్చి పెండ్లిచేయుట •-

సీ. ఆశుభదినమునం దందఱు భుజియించి
తాంబూలములు వేయుతఱిఁ గరంబు
వేడ్కఁ జేతనభట్ల వేంకటకృష్ణశా
స్త్రిలు లోనుగాఁగల సూరిజనులు
తంగెడవంశాబ్జతరణి లక్ష్మీకాంత
కవి రామకృష్ణసత్కవియు మఱియు
ఘనుఁడు తుమ్మలచెర్వు హనుమయాహ్వయ మంత్రి
మొదలుగాఁగలయట్టి ముఖ్యబంధు
లందఱును విన సూర్యనారాయణాభి
ధానుఁ డగ్గలపుం బ్రేమ దండఁ జేరి
నవ్వుమొగమున ననుఁజూచి నయముదొలుక
పలికె నొకమాట తేనియ లొలుకునటుల.

గీ సతత మష్టావధానంబు శతవధాన
మొనరిచెడివార లున్నార లనుచు మేము
విందు మితిహాసములలోని వింతకథలు
వినినలాగున. కాని కన్గొనియెఱుఁగము.

గీ. నలుపు చష్టావధానంబు శతవధాన
మిలపయిని గోనసీమలోపలఁ దిరుపతి
వేంకటేశకవీంద్రులు వెలసి రనుచు
వినుటయే కాని వారినేఁ గని యెఱుంగ.

కం. నేఁటికిఁ గనుగొంటిమి యి
చ్చోటనె మీర లొనరింపఁ జోద్యంబుగ. ప
ల్నాట భవాదృశు లుండుట
నాటికి యశ మబ్బెఁగాదె నరపతివినుతా!

గీ. దాచెపలి యెంత! మఱియుఁ దద్ఘనత యెంత?
దానిఁ బెద్దఁగఁజేసి భూస్థలిని వెలయ
రచనచేసితి గ్రంథంబె రసయుతముగ
రసికజనవర ! పట్టాభిరామసుకవి !

వ. అని మఱియును నాచే మున్ను రచింపఁబడిన దేవీనవరాత్రమహోత్సవాభివర్ణనంబను పద్యకావ్యమ్మును శ్రీశ్రీ జగద్గురు విరూపాక్షసంస్థానమునం జెప్పిన యాశుకవిత్వ చాటుపద్యాదులును నాకర్ణించి తద్విరూపాక్ష పీఠాధిపతియగు శ్రీ విద్యారణ్య భారతీస్వామి యొసంగిన యాశీర్వాదపత్రముం బొడగాంచి,

గీ. ఇరువదేనింటిగంటాల కిద్ధకవిత
చెప్పె సభ నని శ్రీవారి చేతిమొహరు
కలుగు నీపత్రముం జూడఁ దెలియవచ్చె
కానుపింపవె యీ వేడుకయును మాకు.

క. అనుటయు నే నాకవితయు
కనఁబఱచితిః దద్వివాహ కార్యంబున నే
కనెనఁట యప్పయ సన్నట
వినెనఁట యవధానముదితవిబుధులు వొగడన్.

విన్నది మొదలు నన్నల్లునిజేసికొనుట కభిలషించెను. పిలిచి పిల్లనిచ్చెను. 5 దినములు వివాహము చేసెను. అంత్యోత్సాహ మగపఱచెను. పిడుగురాళ్ళలో నీచేసిన యష్టావధానము బిడ్డను నాచే నీకిప్పించినది కాఁబట్టి యాబిడ్డ వివాహమం దష్టావధాన మాచరింపవలెనని యర్థించెను. బిడ్డ కెదురుగాఁ గూర్చుండఁబెట్టి పెండ్లికొడుకుచే నవధాన మాచరింపించెను. ఆనందించెను. అష్టాచరితోద్వాహుండై యది మొదలుకొని యల్లుఁడనైన నాపై నత్యంతానురాగముతో నలరుచు వచ్చెను. అత్యుదారుఁడు. చేతనున్నంతవఱకు రూపాయి దమ్మిడిగఁ జూచెడివాఁడు. కాని కలవాఁడు కాఁడు. ఐనను యథాశక్తి నల్లు నాదరించుచునే యుండెడివాఁడు. మర్యాదగనే చూచెడివాఁడు. 5 రోజులవివాహమం దలుకదీర్చునపుడు హస్తమునకు హేమాభరణము లర్పింతునని యనియు బహుదినములవఱకుఁ బ్రతిశ్రుతమును బాలింపలేకపోవుటయు నప్పుడప్పుడే యక్కఱకువచ్చుచున్న యాయన యాడగుఱ్ఱపుఁబిల్ల నగ్గము చేసికొని యే నెక్కి తిరుగ మొదలుపెట్టితిని. ఆయనయు నంగీకరించెను. అద్దానికిఁ బిల్లలు పుట్ట మొదలుపెట్టుటయు నయ్యశ్వార్భకములపైననే మరల మనసువెట్టెను. అశ్వములన్న నాయన కత్యంతోత్సాహము. ఎప్పుడును నేదో యొక గుఱ్ఱ ముండవలసినదే కాని పరగ్రామములకుఁ బాదచారియై పయనము చేసెడివాఁడు కాఁడు. బహుసైంధవములఁ బరిపాలించెను. అక్కాలమున హయాంతర మమరకుంటఁ గాఁబోలు నర్పితపూర్వమని యనుకొనక యస్మదశ్వముపై నాశపడియెను.

క. మక్కువపడి గుఱ్ఱముపై నెక్కుటకున్ లేదు ప్రకృత మిమ్మియ్యదియం
చొక్కమొగి నడుగ నిచ్చితిఁ జక్కని తొల్లింటిపిల్ల సంతోషముతోన్

యథాశక్తి నట్లన్యోన్యసహాయ మాచరించుకొనుచు మన్మామనిని యుండునంతవఱకు మామయల్లుండ్రము మనఁగలిగితిమి. పెండ్లినాటికన్నను బేదపరిస్థితులు పెచ్చు పెరుఁగుటకును నాఁడుపెట్టిన నగలకంటె నాతిని నానాభరణములచే నలంకరించుటకును

గుటుంబజీవనము వెళ్ళఁదగినంత కొత్తభూమిని గొనఁగలుగుటకును దనబిడ్డపైనను దన పైనను దద్దయుఁ బ్రేమతోఁ దనరుచుండుటకును బొంగిపోవు మామ పుత్రీమరణానంతర మత్యంతము సంగలార్చవలసివచ్చెను. పుత్రికిఁబుట్టిన బిడ్డలయినను దక్కక పూర్తిగా సంబంధము తెగిపోవుటకు వగఁజెందెను. అట్లయ్యుఁ బునర్వివాహితనే కొంతకాలము పుత్రిగాఁ జూచుకొనుచుఁ దానుజేసిన సప్తాహాది సత్కార్యముల కాహ్వానించుచును గట్నములుఁ గానుకలుఁ బెట్టుచును గడుఁబ్రేమతోఁ బ్రవర్తిలెను. ఇది కేవలము మర్యాదాపురస్సరము గాని కడుపులోనుండి వచ్చెడి సహజమైన ప్రేమ గాదు. ముమ్మరల నాహ్వానించి మర్యాదచేయుటయే కాని మాయూరికిమాత్ర మాయన యరుదెంచెడివాఁడు కాఁడు. బిడ్డ కాఁపురముచేసిన ప్రదేశములు కనుటతోడనే కడుపు చెక్కలగుచుండుటం బట్టి కడకుఁ బిడుగురాళ్ళకు వచ్చికూడ నటుదిక్కడు గిడలేక పోయెను. ఇప్పటి నాయిల్లా లీయనను నాయనయనియే పిల్చుచుఁ బాయని ప్రేమతో నుండుచున్నను నిటువచ్చుట కెదఁదలంపకపోవుటయుఁ గ్రమక్రమముగా మాకును మనసు విఱిగెను. ప్రకృత మన్యోన్యగ్రామముల కన్యోన్యగమనాగమనము లభ్రకుసుమప్రాయములే యైనవనవచ్చును. ఇంతవఱ కగపఱచిన యీయన ప్రేమకే యెంతయు నేను గృతజ్ఞుఁడను. నాభార్యతరువాత నాయప్పయ్య కొక కొడుకు నొక కూఁతురు నుదయించి వృద్ధికివచ్చిరి. నుతమాత్రము పతిచేఁ బాల్యమున గాక జనకునింటనే మనుచున్నయది. కొనకు గోమలియుఁగోడలును గూలిపోవుటయు నప్పయ్య కాబిడ్డయే యన్నపానీయము లమర్చుట కాధారమైనయది.

—♦ శ్వశ్రువు (అత్త) ♦—

ఈకె మాకుఁ దిరాత్రిజ్ఞాతియైన తంగెడలోని జానపాటివెంకయ్య చెల్లెలు. అభిధాన మంతమ్మ. ఆవెంకయ్య యర్ధదేహి యస్మచ్ఛ్వశురుఁడైన యప్పయ్య సహోదరి లక్ష్మీనరసమ్మ. బహులుకుబడు లీసంబంధము. అంతమ్మ యప్పయ్యల దాంపత్యము 50 ఏండ్లు. అప్పుడఁతి నిప్పుతునక గాని సామాన్య గాదు. కృతయుగపు మానిని. యథార్థవాదిని. బ్రతికినంతకాలముఁ బతిమాట కెదురుచెప్పని పతివ్రత. చదువుసంధ్యలు లేకున్నను సతీమతల్లియనఁదగు నీబోటి పాటలుమాత్రము బాగుగాఁబాడెడిది. ఆ పాట లభిజ్ఞులకుఁగూడ నాహ్లాదము గలిగించెడివి. ఈ తన్వియు వేతనభట్ల వెంకటకృష్ణశాస్త్రియు నప్పచెల్లెండ్రబిడ్డలు. ప్లవ సం॥ మాఘమాసమున (1902) నేను దాచేపల్లిలో నవధానము లాదరించుచు నంతికస్థమగు నలుగుమల్లెపాటిలో నప్పుడగు నా వెంకటకృష్ణశాస్త్రి యగ్రతనూజుఁడగు నప్పయ్య యుపనయనమున కరిగియుంటిని. నాఁడీయమ యావటువునకు హారతిపట్టుచుఁ బాడిన పాటకుఁ బరమానందము కలుగుటయు నింకొకటి యింకొకటి యని వెంకటకృష్ణశాస్త్రి ద్వారమున సంస్కృతభాషతోఁ గొసరికొసరి పాడించితిని. ఈమె యెవరని పృచ్ఛించి సోమయాజుల యప్పయ్య సుదతి యనియుఁ బతివ్రతయనియు శ్రుతమగుటయు నాఁటినుండియు నామెపై నత్యంతాదరముగలవాఁడ నైతిని. అటు తరువాత నదృష్టవశమున నామె యాత్మజయే యర్ధాంగియయ్యెను. ఆయర్ధాంగికిఁ బ్రాయమువచ్చిన పదపడి తల్లియుఁ దానును గలసి పరిణయాదులలోఁ బాటలు పాడెడివారు. వీ రిరువురును సుస్వరముతోఁ గంతమెత్తి పాడుచో శిక్షితలైన స్త్రీల పాట

వలెఁ గడు హాయిఁగలిపించెడిది. భర్తతోఁ గాఁపురముచేయ మొదలుపెట్టినప్పటినుండియుఁ బాప మాపతివ్రతకు బొట్టె లెందఱో పుట్టిపోయిరి. అట్లు పుట్టి పోయి పోయి యస్మదర్ధదేహి నిలిచెను. దానితరువాతఁగూడ మఱికొందఱుపుట్టిపోయి మగపిల్లఁడొకఁడు మనియెను. అంత వినుకుమీఁద బ్రతికినవారగుటచే యయ్యిరువురిని బిచ్చమ్మయనియుఁ బిచ్చయ్యయనియుఁ బిలువ మొదలుపెట్టుటయుఁ బేరు లవియే యైపోయెను. పిచ్చయ్య పిదపఁగూడ బిడ్డలు కొందఱు పుట్టిపోయి కొన కొక కూఁతురు మనఁగలిగెను. ఆ ముగ్వురిని బెంచి పెద్దఁజేసి పెండ్లి పేరంటములు చేసినది కాని యత్త యామరణము నలమటించుచునే వచ్చినది. పెద్దబిడ్డ పెండ్లియైనది మొదలుకొని యది యంతరించువఱకు మాత్రము కొంత సంతోషముతో నుండినది కాని కొనవఱకు నటు మనలేకపోయెను. అల్లుఁడు యశస్వియని యానందపడుచు నతిప్రేమ చూపెడిది. బిడ్డదగ్గఱవచ్చి పెద్దకాలముండెడిది. జానపాటివారి యాడబిడ్డయే యగుట నేనును నీమెపై నెక్కువ మక్కువతో నుండెడివాఁడను. తన బిడ్డకుఁగాని యల్లునకుఁ గాని తలనొప్పి వచ్చినను బరువెత్తివచ్చి యుపచారములు చేసెడిది. చివరకు జానపాటికిని దమకును ఋణముతీఱినందులకు సంతతముఁ జింతించినది. చింతించి యూరకుండక యాయంతమ్మ యస్మదభివృద్ధి నత్యంతము నాత్మఁ గోరినది. పునర్వివాహము చేసికొనుటకుఁ బ్రోత్సాహము చేసినది. నిజముగా నీమె వేసిన బీజమే మన్మనఃక్షేత్రమునఁ బునర్వివాహానోకహము జనించుటకు ఘనకారణము. బిడ్డచచ్చి పెనుదుఃఖవారినిధి మునిఁగియుండియు మూఁడవ నాఁడే మాడుము పెండ్లియని యల్లునకుఁ జెప్పిన యామె ప్రేమ మనిర్వాచ్యము. వివాహము చేసికొనిన యనంతరము వేమాఱులు చెప్పిపంపి వేమవరమునకుఁ బిలిపించుకొని విందులుచేసిపంపిన యాయమ విశ్వాసము విస్మృతము కానిది. పెద్దదానవైతిని గానఁ బెద్దబిడ్డ యున్న నద్దానియొద్దనే యుండుచుంటినని యనవరతము సంకలార్చుచును వెండియు దాని సవతిని విశేషప్రేమపై వీక్షించుచును సర్వమైన కట్నములు పెట్టి యనుపుచును దలిదండ్రుల మఱపించిన తచ్ఛ్వశ్రూశ్వశురులగు నంతమ్మ యప్పయ్యల యమాయిక వాత్సల్య మవర్ణనీయము. మమ్మెంత ప్రేమించువారలను మేమును బ్రేమాతిశయముతోనే చూచుచుంటిమి కాని మేము వారియింటి కేగినట్లు మాయింటికి వారు రాలేకపోయిరి. కడుపు పగిలిపోవుటయే కారణ మద్దానికి. తద్భార్యాదుఃఖము నాకుఁ బునర్భార్య పోఁగొట్టినది కాని పుత్రీదుఃఖ మవ్వారిని నిరంతరముఁ బరితపింపఁజేసినది. మాయింటనైన గంగాసమారాధనమునకుమాత్ర మవ్వారు కష్టముమీఁద వచ్చుట కిష్టపడిరి. కట్నములుఁ గానుకలుఁ బెట్టిరి. తమ్ముఁ బోషించునని యనుకొన్న పెద్దబిడ్డ మృతికే బిట్టు వాపోయెడి యత్త చిన్నబిడ్డ స్థితికిఁ గూడఁ జింతాసాగరమున మునుఁగవలసివచ్చెను. చచ్చి యది యేడిపించిన బ్రదికి యిది యేడిపించెను. ఈ రెండేడుపులకుఁ దోడు కోడలు కూలిపోయి మూడవయేడుపునకుఁ గూడ మూలమయ్యెను. పడతిని గోలుపోయిన కొడుకు స్థితి కుడుకుచునే పాప మామె పరలోకమున కరిగెను. పెద్దపెరిఁగినది ముగ్వురే యైనను బెక్కండ్రు బిడ్డలఁ గనుటచే నామయవిశిష్టమైన ప్రాణమేను పరిత్యజించి పతిముందఱఁ బట్టెఁడు పసుపుకుంకుములతోఁ బంచషష్టివత్సరప్రాయమునఁ బరమపదించెను.

అనంతరపు అత్తమామలు

అనంతరపుటత్తను నాత్మజరయే యెఱుఁగను. దాని పురిటిలోనో తరువాతనో తచ్ఛ్వశ్రువు తనువుఁ ద్యజించినది. ఆమె పేరు లక్ష్మమ్మ. ఆమె పోయిన యనంతరము మామ సుబ్బరామయ్యగారు మరలఁ బరిణయము జరుపుకొనిరైను. ఆపెతోడను ననేక వత్సరములు కాఁపురము చేసెను. పుత్రత్రయము పుట్టెను. అం దొకఁడు మ్రిందెనఁట. తక్కుటి యిరువురును దల్లిదండ్రిదగ్గఱఁ దనరుచుండిరఁట. తల్లి ధవుఁ డుండఁగనే తనువు త్యజించినది. అముపోయినయనంతర మా మామగూడఁ దానుద్యోగము చేయుచున్న తిరువాన్కూరు రాష్ట్రమున దేశాంతరమందు దిక్కులేక పడియుండఁ బదపడి చేసికొన్న భార్యకుఁ బ్రభవించిన పదియేండ్లబాలుఁడే పరిచర్య జరిపెనఁట. కొన్నాళ్ళు చెల్లెలొకరిత వచ్చి చేసెనఁట. ఆయన ప్రథమభార్యకుఁ బ్రభవించిన పట్టి (నానాతి) పరిణయముజరిపి, పంపునాఁడు పరితపించుటయే కాక పదపడి రెండుమూఁడేండ్లు నెలకొక యుత్తరము వ్రాయుచుఁ గలవరించెను. రెండవపెండ్లము నిందుచూలాలనియుఁ బ్రసవసమయమునఁ బట్టిని నన్ను వచ్చి తోడ్కొనిపోవుదుననియు వ్రాయుచు వచ్చెను. కాని యష్టమమాసముననే యాయమ యతికష్టముపైఁ బ్రసవించుటయుఁ బరలోకగతురాలగుటయుఁ బ్రాప్తించెను. అటుతరువాత వ్యాధితుఁడయ్యెను. ఈకారణములచే నెక్కువపేర్మి గలవాఁడయియు నస్మద్గ్రామమున కరుదెంచుటకుఁ గాని యాలుని బిడ్డను వెంబడించుకొని వెళ్ళుటకుఁ గాని వీలుపడదు. తా బ్రతుకననియుఁ దనయను దోడ్కొనివచ్చి యాఖరుచూపు చూపుమనియు నతిదైన్యముతో నంత్యలేఖ వ్రాసెను కాని పాలకాడే బహుదూరముగా నక్కడికిఁ గూడ నంత దూరమందున్న యన్యద్వీపమగుటను నాదేశమున కన్న దగ్రిమతుఁడగు సుబ్రహ్మణ్య మైదు నెలల వాఁడే యైయుండుటచే నా నెత్తురుకందును వేసికొని యరుగలేకపోతిమి. తదనంతరావ్యవహితకాలముననే తన ధామమునకుఁ జనుదెంచి తనువు విడిచెను. తత్పారలౌకికమునకుఁ బజతెండని పత్రిక పంపిరికాని పూర్వోక్తకారణమునుండియే పోయినవారము కాము. అంతతోనే యాయన చరిత్ర ముగిసెను. ఆయన చతుశ్శాస్త్రవేత్తయగు వైద్యనాథదీక్షితుల యాద్యసంతానమే కాని తాఁ జదివినదిమాత్రము రాజవిద్య.

శ్యాలకులు

మొదటిమఱఁది పిచ్చయ్యయని యిదివరకే యుదాహృతము. వాఁడు పలువురు బిడ్డలు పోయిన తరువాత బ్రతికినవాఁడగుటఁ గడుగారాబముతోఁ బట్టుమని పాఠశాలకుఁ బంపుటకే తలిదండ్రులు తలఁపక పోయిరి. అతిలాలనము చేసి నెత్తి నెక్కించుకొనిరి. అదియే యలవాటుతో నవ్వాఁడు బడియున్న బంధముగా భావించెను. ఎట్టుభావించినను దుట్టతుదకుఁ జదువను వ్రాయను సామాన్యముగా సమకూరెను. వెనుకటినుండియు విద్వత్కుటుంబము గాకునికిని వేదశాస్త్రాభ్యాసవాసనయే యంకురింపదు కాని సంగీతముమాత్రము వీనికి సహజసిద్ధము. పద్యము బాగుగాఁ బఠింపలేకున్నను జదివినంత మట్టుకు శ్రావ్యము. నానాఁటి కాపాట నాటకపాత్రధారణకును హరికథాకథనమునకును ననుకూలించెను. నేను తెనిఁగించిన కంసవధనాటకమును వెనుక మాయూరి విశ్వబ్రాహ్మణులు కొందఱైనవారు వేసినప్పుడు వీనిని బిలిపించుటయు నక్రూరపాత్రధారియై యన్వే

త్సుకుల కన్యలకన్న మిన్నగా నానందము గలిగించుటయు నయ్యెను. అదియే జీవికగాఁ బెట్టుకొని యటనము చేయకున్నను హరికథలుగూడ వీఁడు సరిగాఁ జెప్పఁగలఁడు. వీని వివాహము చెల్లెలిని బదులిచ్చియే చేయవలసివచ్చినది. ఆచెల్లెలిని బిస్నలిగ్రామ నివాసి తంగిరాల సుబ్బయ్యకొడుకు నరసింహమున కిచ్చి వానిచెల్లెలు భ్రమరాంబను వీనికిఁ బెండ్లిచేసిరి. భ్రమరాంబతో వీఁడు 10, 12 ఏండ్లు బద్ధానురాగుఁడై ప్రవర్తిలెను. అది కాఁపురమునకు వచ్చినది మొదల త్తమామ లన్యత్రి యుండవలసివచ్చెను. ఐనను నవ్వాఁడొకఁడే యాత్మజుఁడగుటఁ దలిదండ్రులు తంగెడలోఁబోయి యుండియుఁ దత్క్షేమలాభములను మరలఁ దామే విచారించిరి. వాఁడైనను మూడుమూడునన్న శంకతోనే చేడెను జననిని నొకచోట నుంచఁడు కాని భిన్నభావముచేఁ గాదు. అత్తకోడండ్రును నన్యోన్యము రాకపోకలు జరుపుకొనుచు ననుకూలతతోనే మనెడివారు. కోడలి కోరికను గ్రహించి కొడుకును గోడలును నెక్కడనో యొక్కడ నానుకూల్యముతో నుండి యభివృద్ధికి వచ్చినఁ జాలునని యత్తమామలే యవలఁ దొలఁగిరి కాని రసాభాస రవంతయు నవలోకింపఁబడదు. పిచ్చయ్య భ్రమరాంబతోఁ బెద్దకాలము కాఁపురము చేసినను సంతానవంతుఁడగుట సంభవింపదు. మువ్వురో నల్వురో యవ్వారికిఁ బుట్టి యొక్కింత పెరిఁగియు దక్కకపోయిరి. సంతానవష్టి కవ్వాఁడు చింతించి చేయఁదగిన చికిత్స లెన్నో చేసెనుగాని సిద్ధార్థుఁడు కాలేకపోయెను. రమణితోఁగూడి రామేశ్వరయాత్రగూడఁ జేసివచ్చెను. నాగప్రతిష్ఠ నడపెను. దీనినుండియుఁ దీఱక కర్మము కడకుఁ గాంతయే తీఱినయ్యెను. నాకు మఱఁదియైనందుల కవ్వాఁడు కొంతవఱకు నన్నే పోలెను. నారి నారోగ్యవతిఁజేయుటకు నర్సరావుపేటకే నడచెను. అస్పటలులోనే యుంచెను. పడవలసిన పాట్లన్నియుఁ బడియెను. ఆఖరు కాయూరికే యప్పఁ జెప్పెను. తన్మరణానంతరము తనయుఁడును దలిదండ్రులును వెండియు వేమవరములోనే యుండిరి. కూఁతుండ్ర దుఃఖమునకుఁ గోడలిదుఃఖము తోడగుటయు జరాజర్జరితాంగి యగు జనని స్వర్గమునకుఁ జనియెను. అర్ధాంగియే కాక యంబగూడ నట్లగుటయుఁ బిచ్చయ్య పిచ్చయ్యయే యయ్యెను. అయ్యా యప్పయ్య యవ్వాని పునర్వివాహమున కనేకధా ప్రయత్నింపఁ బ్రయత్నించ నబ్దత్రయమున కది సిద్ధించెను. వెలంపల్లి గ్రామనిలయుఁడు దేవరపల్లి సత్యనారాయణ బిడ్డ యీ వివాహిత. అది యింకను నక్కఱకు రాలేదు. మేనత్తయగు దేవరపల్లి సుబ్బమ్మ యన్నపానీయము లమర్చుచు వేమవరములో వీనివద్ద నుండుచున్నది. తండ్రి తనయు జానకిని మనుపుమను దా దానిచే మనుపఁబడుచును స్థవిరత్వమున మరలఁ దనయునితో వేఱుగనే యుండవలసివచ్చినది. అన్నకును చెల్లెలికిని సంకురించిన యానుకూల్యాభావమే యద్దానికిఁ గారణము. పిచ్చయ్యయుఁ బిచ్చిప్రేమకలవాఁడు. పెక్కేలి? ఆకుటుంబపుఁ బ్రేమయే యటువంటిది. అస్మద్విషయమై యంత ప్రేమగౌరవములు కలవారలైనను నస్మదంగన యాప్రేమబంధమును ద్రెంపిపోవుటచేఁ గ్రమక్రమముగా వారికిని నాకును దూరమైనది. పిచ్చయ్యగూడఁ బిడుగురాళ్ళకు వచ్చి జానపాటికిఁ జనుదెంచుట చాలించుకొన్నవాఁడు. చాలించుకొనుఁగాక సత్వరముగా వాఁడు సంతానవంతుఁడై సోమయాజులవారి వంశమును సుస్థిరముఁ జేయుఁగాక. గౌతమసగోత్రము ఖ్యాతిం గాంచుఁగాక!

౧ మెదక్ శివరామరావు దేశముఖుగారు, నల్లపల్లి
౨ వావిళ్ళ వెంకటేశ్వరశాస్త్రిగారు, చెన్నపట్టణము.
౩ తిప్పరాజు కామేశ్వరరావుగారు, కరణము, దుగ్గిరాల
౪ తిరుమలనల్లాన్ చక్రవర్తి వరదాచార్యుల; అయ్యవార్లంగారు. శాతాపురం.
౫ రాయసము బంటిరావుగారు, అయినాపురము.
౬ రాజా మంత్రిప్రెగడ రఘురావుగారు - లింగగిరి
౭ చిక్కు రాజా మట్టపల్లిరావుగారు - చెలమర్తి. [పీఠము
౮ నాదరగుల్ సంగమేశ్వరరావు గారు శ్రీశ్రీ జగద్గురు శృంగేరి సంస్థాన
౯ అద్దంకి ... తిరువేంగడతాతదేశికాచార్యులయ్యవార్లంగారు, తిరుక్కోవళూరు.
౧౦ మిర్యాలపురం రామకృష్ణారావుగారు, కొల్లాపురం.
౧౧ మల్లాది నరసింహమూర్తిగారు, ప్లీడరు, గురజాల.
౧౨ కొత్వాలి కమలాకరరావు దేశముఖుగారు, నల్లపల్లి.
౧౩ కురిచాల వెంకటేశ్వరరావుదేశముఖుగారు, పులిగళ్ళ
౧౪ రాజా మంత్రిప్రెగడ వెంకటహనుమంతరావుగారు, లింగగిరి.
౧౫ జంకో వెంకటసుబ్బారావుగారు, వకీలు, గురజాల.
౧౬ వద్దిరాజు సత్యనారాయణరావు దేశపాండ్యాగారు, మొడపల్లి
౧౭ గొట్టిపర్తి సుబ్బారావుగారు, వకీలు, సింగరేణి కోలరీసు.
౧౮ మాకేపల్లి వెంకటకృష్ణారావు, మాధవరావు దేశముఖుగార్లు, కొండపల్లి.
౧౯ దంటు లక్ష్మీనరసింహముగారు - సుద్దపల్లి.
౨౦ మద్దూరు సాంబయ్యగారు - పొగాకుకంపెని - పరుచూరు.
౨౧ కేశవరావు దేశముఖుగారు - నెల్లుట్ల
౨౨ ముద్దు చంద్రయ్య, మాకేపల్లి మారుతిరావు దేశముఖుగార్లు, కొత్తపల్లి. [బాదు.
౨౩ రాయప్రోలు సుబ్బారావుగారు, ప్రొఫెసర్, యూనివర్సిటీకాలేజి, హైదరా

— ♦ ఆఱుబయట పరుండుట ♦ —

... గదులలో పరుండుటవలన ... బడలిక కనబడును. ఆఱుబయట పరుండినచో ... కనబడదు ... మన శరీరములో గోట్లకొలది రోమములున్నవి ... వానికి చాలినంత వాయువు కావలసియున్నది. గదులలో నున్నచో గాలి ... సమృద్ధిగా లభించదు.

(ఆరోగ్యప్రకాశిని)

అభినవసరస్వతి

సంపాదకుడు — నాగరఖండస్వర్ణకారవ్యవహారాది బహుగ్రంథకర్తయగు

జానపాటి పట్టాభిరామశాస్త్రి

ఇది యొకమాసపత్రిక ఇందు వర్ణాశ్రమధర్మబోధక గ్రంథములును విమర్శనములును వ్యాసములును ప్రకటింపబడును. చందా సం॥ 1 కి రు 3—0—0

ఈ కార్యస్థానమున వెలకు దొరకు పుస్తకములు.

1	విరూపాక్షపీఠగురుపరంపర ...	0	3	0
2	నీతిగీతములు (స్మృతినీతిశతకములు, దానికి శ్లోకములు) ...	0	2	0
3	జానకీపరిణయ నాటకము ...	0	4	0
4	కలికోద్ధారిణి [ప్రాచీనపద్యబంధము] ...	0	4	0
5	విశ్వబ్రాహ్మణశబ్దఖండనము, బ్రాహ్మణశబ్దవిచారము	0	2	0
6	సత్పురుషనీతిశతకము ...	0	1	0
7	వర్ణాశ్రమ ... ([illegible])	0	8	0
8	సంగ్రహము ...	0	8	0
9	వర్ణశబ్దవిచారము ...	0	2	0
10	పురశ్చరణము ...	0	3	0
11	విగ్రహారాధన ఖండనఖండనము ...	0	4	0
12	స్వర్ణకారవ్యవహారము ..	1	8	0
13	శుద్ధాంధ్రభారతసంగ్రహ చరిత్రము ..	0	10	0
14	సూతసంహిత (ఆంధ్రము) ..	2	0	0
15	భారతీయప్రబోధము (పిడుపాటి చిదంబరశాస్త్రి)	0	4	0
16	వర్ణనిర్ణయము.	0	4	0
17	అస్పృశ్యతానివారణఖండనము (మల్లాది రామకృష్ణచయనులుగారు)	0	8	0
18	స్కాందమహాపురాణాంతర్గత నాగరఖండము (౧ సంపుటము)	1	0	0
19	డిటో నాగరఖండము (౨ సంపుటము)	1	8	0
20	డిటో నాగరఖండము (౩ సంపుటము)	1	8	0
21	డిటో నాగరఖండము (౪ సంపుటము)	1	8	0
22	పల్నాటివీరచరిత్ర	0	12	0
23	ఆరోగ్యభాస్కరము	0	6	0
24	భాగవతరహస్యములు	0	4	0
25	సౌశీల్యరత్నాకరము	0	2	6

అభినవసరస్వతీకార్యస్థానము, జానపాడు, పిడుగురాళ్ళపోస్టు,

గుంటూరు జిల్లా.